www.prajavinikidi.com
RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా వినికిడి
తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
8978701613,7013016545

సంపుటి - 3 సంచిక -244 ఆదివారం 7 డిసెంబర్ 2025 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు -8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## సిరీస్ కైవసం

**వైజాగ్ వన్డేలో టీమిండియా ఘన విజయం...**

- మూడో వన్డేలో దక్షిణాఫ్రికాను చిత్తు చేసిన భారత్
- అజేయ సెంచరీతో చెలరేగిన యశస్వి జైస్వాల్
- చెరో నాలుగు వికెట్లతో సత్తా చాటిన కుల్దీప్, ప్రసిద్ధ్ కృష్ణ



2లో.

## రూపాయి పతనం పూర్తిగా ప్రతికూలం కాదు

- ఎగుమతిదారులకు ప్రయోజనకరమేనన్న నిర్మలా సీతారామన్
- డాలర్ తో పోలిస్తే రికార్డు స్థాయిలో పడిపోయిన రూపాయి విలువ
- సమీప భవిష్యత్తులో రూ.91 మార్క్ తాకనుందని అంచనా



## ఎస్ఎల్బీసీ పూర్తి చేసి నల్గొండ జిల్లాకు
# నీరు అందిస్తాం



- కేసీఆర్ పదేళ్లపాటు పట్టించుకోకుండా నిర్లక్ష్యం
- ప్రజలను పట్టించుకోకుండా కెసిఆర్ పాలన
- కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే కొత్త రేషన్ కార్డులు
- దొడ్డు బియ్యం రద్దు చేసి సన్నబియ్యం ఇస్తున్నాం
- పేదలకు 4.50లక్షల ఇళ్లు మంజూరు చేశాం
- దేవరకొండ సభలో సీఎం రేవంత్

దేవరకొండ, **డిసెంబర్ 6ప్రజావినికిడి**
గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో ప్రాజెక్టులను పండబెట్టారని, ఈ ప్రభుత్వ హయాంలోనే ఎస్ఎల్బీసీ ప్రాజెక్టు పూర్తి చేసి నల్గొండ జిల్లాకు నీరు అందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఎస్ఎల్బీసీను కేసీఆర్ పదేళ్లపాటు పట్టించుకోలేదు, నిర్లక్ష్యం చేశారు. ఎస్ఎల్బీసీ ఆగిందని మామ, అల్లుడు డ్యాన్సులు చేస్తున్నారు. ఎవరూ అడ్డుపడ్డా ఎస్ఎల్బీసీను పూర్తిచేసి తీరుతాం' అని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. 2లో...




## ఇండిగోపై కేంద్రంకన్నెర్ర..

**సీఈఓ తొలగింపు, భారీ జరిమానాకు యోచన..!**

- పైలట్ల విశ్రాంతి నిబంధనల అమలులో గందరగోళం
- భారీ జరిమానాతో పాటు విమానాల సంఖ్య తగ్గింపునకు యోచన
- కొత్త నిబంధనలను తాత్కాలికంగా నిలిపివేసిన ప్రభుత్వం
- సంక్షోభంపై ఉన్నత స్థాయి విచారణకు ఆదేశం

2లో.





## హిల్ట్ పాలసీపైతెలంగాణ హైకోర్టు స్టేకు నిరాకరణ..

**ఇది కేవలం విధానపరమైన ప్రకటనేనన్న ప్రభుత్వ వాదనతో ఏకీభావం**

- కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు
- కాలుష్య పరిశ్రమల తరలింపుకే పాలసీ తెచ్చామన్న అడ్వకేట్ జనరల్
- మాస్టర్ ప్లాన్‌కు విరుద్ధమంటూ పిటిషనర్ల ఆందోళన




2లో.

## కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా కేంద్రంపై పోరాడుదాం

- విదేశీ చట్టాలను మనదేశంలో ఎలా తెస్తారు
- ఇక్కడి సామాజిక పరిస్థితులు వేరు కదా
- రౌండ్ టేబుల్ సమావేశంలో కెటిఆర్ పిలుపు

హైదరాబాద్,**డిసెంబర్ 6ప్రజావినికిడి**ప్రపంచంలోనే అత్యంత కుబేరులు భారతదేశంలో ఉన్నారని, అలాగే అత్యంత పేదరికం కూడా ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. 'ప్రపంచమే కుగ్రామం' అనే పేరుతో అమెరికా, ఐరోపాలో తెచ్చిన చట్టాలను ఇక్కడ తెస్తే కుదరదని హెచ్చరించారు. ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్లలో భాగంగా కొత్త సంస్కరణలు తెస్తున్నారని, అయితే.. సామాజిక స్థితులను పరిగణనలోకి తీసుకోకుండా ఏ చట్టాలు తెచ్చినా వాటిపై తిరగబడాల్సిందేనని కేటీఆర్ హెచ్చరిక చేశారు. తెలంగాణ భవన్‌లో కార్మిక సంఘాల రౌండ్ టేబుల్ మీటింగ్‌లో కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. మిగతా 2లో...



## సాగు విస్తీర్ణం ఆధారంగా యూరియా పంపిణీ!

- కీలక నిర్ణయం దిశగా తెలంగాణ ప్రభుత్వం!
- సాగు లెక్కల కోసం ప్రత్యేక యాప్ అభివృద్ధి



హైదరాబాద్, **డిసెంబర్ 6ప్రజావినికిడి**వానాకాలం సాగు సమయంలో తెలంగాణలో యూరియా కోసం రైతుల ఎన్ని ఇబ్బందులు పడ్డారో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. బస్తా యూరియా కోసం గంటల కొద్ది కిలోమీటర్ల మేర క్యూలైన్లలో నిల్చున్నారు. మిగతా 2లో...

## మహానటి సావిత్రికి మరణం లేదు

- చిత్ర పరిశ్రమలో ఆమె చరిత్ర చిరస్థాయి
- అలాంటి నటులు నేడు లేరు..రారు
- మంచి సినిమాలు తీస్తే అంతా ఆదరిస్తారు
- సావిత్రి మహోత్సవంలో వెంకయ్యనాయుడు

హైదరాబాద్,**డిసెంబర్ 6ప్రజావినికిడి**మహానటి సావిత్రికి మరణం లేదని, ఆమె చరిత్ర అజరామరమని భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు అన్నారు. చిత్రపరిశ్రమ ఉన్నంత వరకు ఆమె జీవిస్తూనే ఉంటుందని అన్నారు. 'మహానటి' సావిత్రి 90వ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతి వేదికగా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన ఆయన అనేక విషయాలపై మాట్లాడారు. మహానటిగా ప్రేక్షకాభిమానం సొంతం చేసుకున్న సావిత్రి 90వ జయంతి సందర్భంగా ఆమెకు నివాళి అర్పిస్తున్నా. 'సావిత్రి మహోత్సవం' అనిమిగతా 2లో...



## గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్ల పరిశీలన


**ఏరియల్ సర్వే నిర్వహించిన సిఎం రేవంత్**

హైదరాబాద్,**డిసెంబర్ 6ప్రజావినికిడి:**తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. శనివారం సాయంత్రం ఏరియల్ వ్యూ ద్వారా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లను పరిశీలించారు. రేవంత్ వెంట మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కూడా ఉన్నారు. మిగతా 2లో...




## తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం..

**ఐదుగురు ఏపీ భక్తుల మృతి**



ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక



# ఇండిగోపై కేంద్రం కన్నెర్ర..

న్యూఢిల్లీ **డిసెంబర్ 6ప్రజావినికిడి**

దేశీయ విమానయాన దిగ్గజం ఇండిగోపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. పైలట్ల విశ్రాంతి సమయానికి సంబంధించిన కొత్త నిబంధనల అమలులో గందరగోళం సృష్టించి, దేశవ్యాప్తంగా భారీగా విమానాలను రద్దు చేసినందుకు ఇండిగో సీఈఓ పీటర్ ఎల్బర్స్‌ను పదవి నుంచి తొలగించాలని ఆ సంస్థను కోరాలని కేంద్రం యోచిస్తున్నట్లు సమాచారం.ఇండిగో వైఫల్యం కారణంగా వేలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురైన నేపథ్యంలో పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఆ సంస్థ అధికారులను ఇవాళ సాయంత్రం సమావేశానికి పిలిపించింది. సంస్థపై కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని, ఇందులో భాగంగా భారీ జరిమానా విధించే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా ఇండిగో నిర్వహించే విమానాల సంఖ్యను తగ్గించడం ద్వారా దేశంలోనే అతిపెద్ద విమానయాన సంస్థకు గట్టి సంకేతాలు పంపాలని యోచిస్తోంది.పైలట్లకు సుదీర్ఘ విశ్రాంతి కల్పించేందుకు ఏవియేషన్ రెగ్యులేటర్ తీసుకొచ్చిన కొత్త ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్స్ నిబంధనలకు అనుగుణంగా అవసరమైన పైలట్ల సంఖ్యను ఇండిగో యాజమాన్యం తప్పుగా అంచనా వేసింది. దీంతో ఒక్కసారిగా పైలట్ల కొరత ఏర్పడి, దేశీయ సర్వీసులను నడపడంలో సంస్థ తీవ్రంగా విఫలమైంది.ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వం ప్రస్తుతానికి ఈ కొత్త ఎఫ్‌డీటీఎల్ నిబంధనలను తాత్కాలికంగా నిలిపివేసింది. మూడు రోజుల్లో పరిస్థితి చక్కబడుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ సంక్షోభంపై ఉన్నత స్థాయి విచారణకు కూడా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

# హిల్ట్ పాలసీపైతెలంగాణ హైకోర్టు స్టేకు నిరాకరణ..

**ఇది కేవలం విధానపరమైన ప్రకటనేనన్న ప్రభుత్వ వాదనతో ఏకీభావం**

హైదరాబాద్ **డిసెంబర్ 6ప్రజావినికిడి**

హైదరాబాద్ నగరంలోని పారిశ్రామిక భూములను ఇతర అవసరాలకు కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన హిల్ట్ (హైదరాబాద్ ఇంటిగ్రేటెడ్ లైఫ్‌స్టైల్ టౌన్‌షిప్) పాలసీపై మధ్యంతర ఉత్తర్వులు (స్టే) ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. ఇది కేవలం విధానపరమైన ప్రకటన మాత్రమేనని, ఇంకా ఎలాంటి చర్యలు ప్రారంభించలేదని అడ్వకేట్ జనరల్ (ఏజీ) సుదర్శన్ రెడ్డి కోర్టుకు వివరించడంతో ధర్మాసనం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. హిల్ట్ పాలసీపై కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేస్తూ, తదుపరి విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది.ప్రభుత్వం నవంబర్ 22న జారీ చేసిన జీవో 27 హెచ్ఎండీఏ చట్టానికి, మాస్టర్ ప్లాన్‌కు విరుద్ధంగా ఉందని ఆరోపిస్తూ ప్రొఫెసర్ కె. పురుషోత్తంరెడ్డి, ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కె.ఎ.పాల్ వేర్వేరుగా ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ శ్యాంకోసీ, జస్టిస్ చలపతిరావులతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది కె. వివేక్‌రెడ్డి వాదిస్తూ, పారిశ్రామిక భూములను నివాస, వాణిజ్య సముదాయాలకు కేటాయించడం నిబంధనలకు విరుద్ధమన్నారు. దీనిపై స్టే విధించకపోతే ప్రభుత్వం దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.అయితే, అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి ఈ వాదనలను తీవ్రంగా వ్యతిరేకించారు. హైదరాబాద్‌ను "గ్రీన్ సిటీ"గా మార్చే లక్ష్యంతోనే కాలుష్య పరిశ్రమలను నగరం వెలుపలికి తరలించేందుకు ఈ పాలసీని తెచ్చామని తెలిపారు. బాలానగర్, కూకట్‌పల్లి, కాటేదాన్ ప్రాంతాల్లో కాలుష్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇది కేవలం విధానపరమైన నిర్ణయమని, హెచ్ఎండీఏ చట్టం ప్రకారమే ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించి, మాస్టర్ ప్లాన్‌ను సవరిస్తామని, అందుకు ఇంకా సమయం ఉందని స్పష్టం చేశారు. ఏజీ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం, మధ్యంతర ఉత్తర్వులకు నిరాకరిస్తూ విచారణను వాయిదా వేసింది.

# కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా కేంద్రంపై పోరాడుదాం

(మొదటి పేజి తరువాయి)

సోనియా గాంధీ ఢిల్లీలో వ్యతిరేకించిన బిల్లును, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎలా అమలు చేస్తుందని కేటీఆర్ ప్రశ్నించారు. ఇక్కడి నుంచే పోరాటాన్ని మొదలుపెడదామని పిలుపునిచ్చారు. ఢిల్లీలో కేంద్ర కార్మిక మంత్రిని, పార్లమెంటు స్టాండింగ్ కమిటీ సభ్యులను కలుద్దామని.. లేబర్ కోడ్‌ల అమలు ఆపేదాకా అసెంబ్లీ, మండలి సమావేశాలు స్తంభింపజేస్తామని అన్నారు. దీనిపై వరంగల్‌లో తదుపరి రౌండ్ టేబుల్ మీటింగ్ నిర్వహిస్తామని తెలిపారు. దేశంలో 92శాతం మందికి తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయని తెలిపారు. సిరిసిల్ల చేనేత కార్మికులను ఆదుకునేందుకు పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రూ.3,500 కోట్ల మేర బతుకమ్మ చీరల తయారీకి కేసీఆర్ ఆర్డర్ ఇచ్చారని గుర్తు చేశారు. అయితే, కొందరు పిచ్చోళ్లు తెలియక ఏదేదో మాట్లాడుతున్నారని విమర్శలు గుప్పించారు. తాము ప్రతిపక్షంలో ఉన్నా నేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటే కేసీఆర్ చలించిపోయి పార్టీ తరఫున ఆర్థిక సాయం చేశారన్నారు. కనీసం పాలకుల్లో చలనమైనా వస్తుందని కేసీఆర్ సాయం చేశారని చెప్పుకొచ్చారు. నాలుగు దశాబ్దాల క్రితం చైనా జీడీపీ మనకన్నా తక్కువగా ఉండేదని, ఇప్పుడు మనది నాలుగు ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థ అయితే, చైనాది అరవై ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థని కేటీఆర్ తెలిపారు. చైనా ఎప్పటికప్పుడు ప్రజలకు అనుగుణంగా నూతన విధానాలు తీసుకురాబట్టే ఫలితాలు సాధించిందన్నారు. అన్నింటికీ ముందు.. పోరాడే పార్టీకి పార్లమెంట్‌లో తగిన సీట్లు ఇవ్వడమే కారణమన్నారు. లోక్‌సభలో బీఆర్ఎస్‌కు ప్రాతినిధ్యం లేకపోవడం వల్ల కాంగ్రెస్, బీజేపీలు కలిసి ఇలాంటి చట్టాలను తెస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోనోపోలీ వల్ల ఎలాంటి అనర్థం జరుగుతుందోనన్నారు. ఇండిగో విమానయాన సంస్థ వల్ల ప్రయాణికులకు ఐదు రోజులుగా జరిగిన అసౌకర్యం ప్రత్యక్ష ఉదాహరణ అని పేర్కొన్నారు. ఐదు రోజుల్లో వెయ్యి విమానాలు రద్దయ్యాయన్నారు. కేంద్ర ప్రభుత్వం.. పోర్టులు, ఎయిర్ పోర్టులు, ఇతర మౌలిక సదుపాయాల సంస్థలు కొంతమంది చేతుల్లో పెట్టడం వల్ల ఇలాంటి ఉపద్రవాలు వస్తున్నాయని అన్నారు. శ్రమదోపిడీ వల్లే ఇదంతా జరిగిందని మండిపడ్డారు. ఇండిగో ఒత్తిడికి కేంద్రమే తలొగ్గింది తప్ప, ఇండిగో తగ్గలేదన్నారు.కేంద్రం ఐదు రోజుల తర్వాత స్పందించడం వల్ల ఎయిర్ పోర్టులు బస్ స్టేషన్లు, రైల్వేస్టేషన్లుగా మారాయన్నారు. కొత్త లేబర్ కోడ్‌లు అమల్లోకి వస్తే ఇండిగో వల్ల జరిగిన అసౌకర్యం మిగతా రంగాలకు విస్తరిస్తుందని, ఇప్పుడు ఏ ఎన్నికలు లేవని, బీఆర్‌టీయూ ఎవరితోనైనా పని చేయొచ్చని వివరించారు. లేబర్ కోడ్‌లు రాష్ట్రంలో అమలు చేయకుండా అడ్డుకుంటే దేశానికి దిక్సూచి అవుతుందన్నారు. లేబర్ కోడ్‌ల అమలు ఆపేదాకా అసెంబ్లీ, మండలి సమావేశాలు స్తంభింపజేస్తామని పిలుపునిచ్చారు. వరంగల్‌లో తదుపరి రౌండ్ టేబుల్ మీటింగ్ నిర్వహిస్తామని మాజీ మంత్రి కేటీఆర్ తెలిపారు

# రూపాయి పతనం పూర్తిగా ప్రతికూలం కాదు

**ఎగుమతిదారులకు ప్రయోజనకరమేనన్న నిర్మలా సీతారామన్**

న్యూఢిల్లీ**డిసెంబర్ 6ప్రజావినికిడి**

అమెరికా డాలర్ తో పోలిస్తే రూపాయి విలువ రికార్డు స్థాయి కనిష్ఠానికి పడిపోయిన విషయం తెలిసిందే. డాలర్ తో రూపాయి మారకం విలువ ప్రస్తుతం 89.95 గా ఉంది. రెండు రోజుల క్రితం ఈ విలువ 90 కి చేరింది. సమీప భవిష్యత్తులో ఈ మారకం విలువ రూ.91కి చేరుతుందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు.ఈ నేపథ్యంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తాజాగా ఈ విషయంపై స్పందించారు. రూపాయి పతనం పూర్తిగా ప్రతికూలం కాదని చెప్పారు. హిందుస్థాన్ టైమ్స్ లీడర్ షిప్ సదస్సులో మాట్లాడుతూ.. రూపాయి పతనం వల్ల భారత దేశంలోని ఎగుమతిదారులకు ప్రయోజనకరమేనని మంత్రి అభిప్రాయపడ్డారు.భారత రూపాయి మారకం విలువ ఇటీవల అమెరికన్ డాలర్‌తో పోలిస్తే చారిత్రాత్మక కనిష్ఠ స్థాయికి పడిపోయింది. ఈ డిసెంబర్ 3న రూపాయి రూ. 90.43 వద్ద కనిష్ట స్థాయిని తాకింది. రూపాయి బలహీనపడటం వల్ల దిగుమతులు ఖరీదైనవిగా మారతాయి, ఇది ద్రవ్యోల్బణాన్ని పెంచుతుంది మరియు విదేశాలలో చదువుతున్న విద్యార్థులు, అంతర్జాతీయ ప్రయాణికుల బడ్జెట్‌లపై ప్రభావం చూపుతుంది. అయితే, బలహీనమైన రూపాయి భారతీయ ఎగుమతిదారులకు ప్రయోజనం చేకూర్చే అవకాశం ఉంది. ఎందుకంటే వారి ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్లలో చౌకగా మారతాయి.

# ఏపీలోని పట్టణాలకు రూ. 281 కోట్లు..

**ఏపీలోని పట్టణాలకు 15వ ఆర్థిక సంఘం నిధులు**

అమరావతి,**డిసెంబర్ 6ప్రజావినికిడి**

ఆంధ్రప్రదేశ్‌లోని పట్టణాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు విడుదలయ్యాయి. 15వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు, పది లక్షల లోపు జనాభా ఉన్న (నాన్-మిలియన్ ప్లస్) నగరాలకు రెండో విడత గ్రాంట్‌గా రూ. 281.89 కోట్లను కేంద్రం మంజూరు చేసింది. ఈ నిధుల వినియోగానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు (జీవో) జారీ చేసింది.ఈ నిధులను ప్రధానంగా పట్టణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం వినియోగించనున్నారు. ముఖ్యంగా రోడ్లు, వీధి దీపాలు, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా వంటి ప్రాథమిక అవసరాల మెరుగుదలకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. విడుదలైన నిధులను "టైడ్" మరియు "అన్-టైడ్" గ్రాంట్ల రూపంలో కేటాయించారు.

ఈ విధానం వల్ల ప్రతి పట్టణం తమ స్థానిక అవసరాలకు అనుగుణంగా నిధులను ఖర్చు చేసుకునేందుకు వెసులుబాటు కలుగుతుంది. ఏయే పనులకు ఎంత మొత్తం కేటాయించాలనేది స్థానిక పరిస్థితులను బట్టి నిర్ణయిస్తారు. ఈ నిధుల విడుదలతో రాష్ట్రంలోని చిన్న, మధ్య తరహా పట్టణాల్లో అభివృద్ధి పనులు మరింత వేగవంతం కానున్నాయి. ప్రభుత్వం జీవో జారీ చేయడంతో నిధుల వినియోగానికి మార్గం సుగమమైంది.

# ఎస్ఎల్‌బీసీ పూర్తి చేసి నల్గొండ జిల్లాకు నీరు అందిస్తాం

(మొదటి పేజి తరువాయి)

ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా నల్గొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గంలో రూ.23 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. పోరాటాల పౌరుషం ఉన్న గడ్డ నల్గొండ. నిజాం నిరంకుశ పాలనను ఎదురించిన జిల్లా నల్గొండ. ప్రజా ప్రభుత్వానికి అండగా నిలిచిన అందరికీ ధన్యవాదాలు అని తెలిపారు. గత ప్రభుత్వం పదేళ్ల పాటు పేదలకు ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కొత్త రేషన్ కార్డులు ఇచ్చింది. రేషన్ కార్డులపై దొడ్డు బియ్యం రద్దు చేసి సన్నబియ్యం ఇస్తున్నాం. పేదల ఆకలి తీర్చినప్పుడే నిజమైన ఇందిరమ్మ రాజ్యం అని మన ప్రభుత్వం సంపూర్ణంగా విశ్వసిస్తోంది. దేశంలో సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమే. గుజరాత్ సహా దేశంలో మరే రాష్ట్రంలోనూ సన్న బియ్యం ఇవ్వట్లేదు. యూపీఏ ప్రభుత్వ హయాములో రాష్ట్రంలో 25లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరిగింది. గత పదేళ్లలో ఎంతమంది పేదలకు ఇళ్లు ఇచ్చారో కేసీఆర్ చెప్పాలి. మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే 4.50లక్షల ఇళ్లు పేదలకు మంజూరు చేశాం. లంబాడీలకు ఎస్టీ రిజర్వేషన్లు కల్పించిందే ఇందిరమ్మ ప్రభుత్వం.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే 25లక్షల మంది రైతులకు రుణమాఫీ చేసింది. ఒకే విడతలో రూ.2లక్షల చొప్పున రూ.21వేల కోట్లను రైతుల ఖాతాల్లో వేశాం. రుణమాఫీ పేరిట పదేళ్లపాటు రైతులను కేసీఆర్ మోసం చేశారు. గతంలో మంత్రులు, ఎమ్మెల్యేలను కూడా కేసీఆర్ కలిసేవారు కాదు. ప్రగతి భవన్, ఫామ్‌హౌజ్‌లోకి ఎవ్వరినీ రానివ్వలేదు. కానీ, నిన్న ఇద్దరు సర్పంచ్‌లను కూర్చోబెట్టుకుని మళ్లీ మనకు మంచి రోజులు వస్తాయని చెబుతున్నారు. కేసీఆర్ ఓడిపోయాకే రాష్ట్రానికి, ప్రజలకు మేలు జరుగుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిన ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును కేసీఆర్ పదేళ్లపాటు పట్టించుకోలేదు. ఈ ప్రభుత్వ హయాంలోనే ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును పూర్తి చేస్తాం. ఎస్ఎల్‌బీసీ పనులు ప్రారంభించగానే సొరంగంలో దురదృష్టవశాత్తూ ప్రమాదం జరిగింది. సొరంగంలో ప్రమాదం జరిగితే భారత రాష్ట్ర సమితి నేతలు సంబరపడ్డారు. ఏదేమైనా టన్నెల్‌ను పూర్తి చేసి నీరు అందిస్తాం' అని సీఎం అన్నారు. తమ ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధి రెండుకళ్లుగా పాలన సాగుతోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రజాపాలన రెండేళ్లు పూర్తిచేసుకుంటున్నామని పేర్కొన్నారు. నిజాంలు, రజాకార్లను తరిమికొట్టిన ప్రాంతం నల్గొండ అని చెప్పుకొచ్చారు. గడీల పాలనను ప్రజలు తరిమికొట్టారని ప్రస్తావించారు. కేసీఆర్ హయాంలో పేదలకు రేషన్ కార్డులు ఇవ్వాలనే ఆలోచనే చేయలేదని విమర్శించారు. పేదలందరికీ తమ ప్రభుత్వంలో రేషన్ కార్డులు ఇచ్చామని స్పష్టం చేశారు. పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని పేర్కొన్నారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం భారీ బహిరంగ సభలో ప్రసంగించారు సీఎం రేవంత్‌రెడ్డి. 'కేసీఆర్ హయాంలో పేదలకు దొడ్డుబియ్యం ఇచ్చారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ సన్నబియ్యం ఇవ్వట్లేదు. మా హయాంలో సన్నబియ్యం సరఫరా చేస్తున్నాం. పేదల ఆకలి తీర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం. డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తానని మాట ఇచ్చి కేసీఆర్ మోసం చేశారు. యూపీఏ హయాంలో తెలంగాణలో 25 లక్షల ఇళ్లు మంజూరు చేశారు. ఇప్పుడు తెలంగాణలో 4 లక్షలకు పైగా ఇళ్లు కడుతున్నాం. పదేళ్ల కేసీఆర్ పాలనలో ఎన్ని ఇళ్లు ఇచ్చారో చెప్పాలి. కాంగ్రెస్ పాలనలో పేదలకు న్యాయం జరుగుతుంది. కాంగ్రెస్ గెలిస్తే కరెంట్ ఉండదన్నారు. 24 గంటలపాటు ఉచిత విద్యుత్ ఇచ్చిన ఘనత మాదే. ఉచిత కరెంట్ పేటెంట్ కాంగ్రెస్‌దే. పేదలంటే కేసీఆర్‌కు ఇష్టం ఉండదు. రైతులను కేసీఆర్ మోసం చేశారు' అని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. 'మంచిరోజులు వస్తాయని కేసీఆర్ అంటున్నారు.

# తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం..

## ఐదుగురు ఏపీ భక్తుల మృతి

అమరావతి, **డిసెంబర్ 6ప్రజావినికిడి** తమిళనాడులో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం ఐదు కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఐదుగురు అయ్యప్ప భక్తులు ఈ ప్రమాదంలో దుర్మరణం చెందారు. రామనాథపురం జిల్లా సమీపంలో వీరు ప్రయాణిస్తున్న కారును మరో కారు బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. ఏపీకి చెందిన అయ్యప్ప భక్తులు రామేశ్వరం దర్శించుకుని తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. రామనాథపురం జిల్లా కీజక్కరై వద్ద వీరు ప్రయాణిస్తున్న వాహనాన్ని ఎదురుగా వస్తున్న మరో కారు వేగంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు రెండు కార్లు నుజ్జునుజ్జయ్యాయి. సమాచారం ప్రకారం, కారులో ఉన్న ఐదుగురు భక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న కీజక్కరై పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. వెంటనే సహాయక చర్యలు చేపట్టి, గాయపడిన వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారికి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు. మృతులను విజయనగరం జిల్లా దత్తిరాజేరు మండలం కోరపు కొత్తవలస, గజపతినగరం మండలం మరుపల్లి గ్రామ వాసులుగా గుర్తించారు.

# వైజాగ్ వన్డేలో టీమిండియా ఘన విజయం...

**డిసెంబర్ డిసెంబర్ 6ప్రజావినికిడి**

దక్షిణాఫ్రికాతో జరిగిన నిర్ణయాత్మక మూడో వన్డేలో టీమిండియా జయభేరి మోగించింది. విశాఖపట్నం ఏసీఏ-వీడీసీఏ స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో 9 వికెట్ల తేడాతో సఫారీ జట్టును చిత్తు చేసి, మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-1 తేడాతో కైవసం చేసుకుంది. ఈ సిరీస్‌లో తొలి వన్డేలో భారత్ నెగ్గగా, రెండో వన్డేలో దక్షిణాఫ్రికా గెలిచింది. దీంతో ఇరు జట్లకు కీలకంగా మారిన ఆఖరి మ్యాచ్‌లో భారత్ సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించింది.271 పరుగుల లక్ష్యఛేదనలో బరిలోకి దిగిన భారత్‌కు ఓపెనర్లు యశస్వి జైస్వాల్, రోహిత్ శర్మ అద్భుతమైన శుభారంభాన్ని అందించారు. రోహిత్ శర్మ (75) దూకుడుగా ఆడగా, యశస్వి జైస్వాల్ (116 నాటౌట్) అజేయ సెంచరీతో కదం తొక్కాడు. జైస్వాల్ స్కోరులో 12 ఫోర్లు, 2 సిక్సులు ఉన్నాయి. రోహిత్ ఔటయ్యాక క్రీజులోకి వచ్చిన విరాట్ కోహ్లీ (45 బంతుల్లో 65 నాటౌట్) కూడా మెరుపు ఇన్నింగ్స్ ఆడటంతో భారత్ 39.5 ఓవర్లలో కేవలం ఒక వికెట్ మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని సునాయాసంగా ఛేదించింది.అంతకుముందు టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న భారత్, దక్షిణాఫ్రికాను 47.5 ఓవర్లలో 270 పరుగులకు ఆలౌట్ చేసింది. సఫారీ జట్టులో ఓపెనర్ క్వింటన్ డి కాక్ (106) సెంచరీతో ఒంటరి పోరాటం చేశాడు. కెప్టెన్ బవుమా (48) ఫర్వాలేదనిపించినా, మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. భారత బౌలర్లలో కుల్దీప్ యాదవ్, ప్రసిద్ధ్ కృష్ణ చెరో నాలుగు వికెట్లతో సఫారీ పతనాన్ని శాసించారు. అర్షదీప్ సింగ్, రవీంద్ర జడేజా చెరో వికెట్ పడగొట్టారు.

# గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్ల పరిశీలన

(మొదటి పేజి తరువాయి)

రంగారెడ్డి జిల్లా కందుకూర్ మండలం ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 8,9 వ తేదీల్లో రైజింగ్ గ్లోబల్ సమిట్ జరగనుంది. తెలంగాణను ప్రపంచ పెట్టుబడులకు గమ్యస్థానంగా మార్చడంతో పాటు రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్‌ను అంతర్జాతీయ స్థాయిలో పెంచడమే లక్ష్యంగా ఈ సదస్సును తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. డిసెంబర్ 8 మధ్యాహ్నం ఒంటి గంటకు గ్లోబల్ సమ్మిట్ ను గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ప్రారంభించనున్నారు. తొలి రోజు ముఖ్యమంత్రి, మంత్రుల ప్రసంగాలు ఉంటాయి. మొత్తం 27 సెషన్లు ఉంటాయి. డిసెంబర్ 8న మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3 గంటల వరకు ప్రసంగాలు ఉంటాయి. మధ్యాహ్నం 2.30గంటలకు రేవంత్ ప్రసంగించనున్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి పలు రంగాలపై చర్చ జరుగుతుంది. 3 గంటల నుంచి 4 గంటల వరకు విద్యుత్ రంగంపై చర్చ ఉంటుంది. సెమీకండక్టర్లు, గ్రీన్ ఎర్జీ , ఎరోస్పేస్ ఎడ్యుకేషన్ పై చర్చ జరుగుతుంది. సాయంత్రం 6గంటలకు సమ్మిట్ ముగుస్తుంది. డిసెంబర్ 9వ తేదీ ఉదయం 10 గంటలకు సమ్మిట్ ప్రారంభం అవుతుంది. సాయంత్రం 6 గంటలకు ముగుస్తుంది.

---------

# సాగు విస్తీర్ణం ఆధారంగా యూరియా పంపిణీ!

(మొదటి పేజి తరువాయి)

యూరియా కొరతపై ఇటు విపక్షాల నుంచే కాక ప్రజలు కూడా ప్రభుత్వం మీద తీవ్ర స్థాయిలో అసహనం వ్యక్తం చేశారు. ఇక విపక్షాలు అయితే ప్రభుత్వ అసమర్థత వల్లే కేంద్రం రాష్ట్రానికి సరిపడా యూరియాను సరఫరా చేయలేదని దుమ్మెత్తిపోశాయి. ఈ క్రమంలో యాసంగి సీజన్‌కు సంబంధించి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈసారి యూరియా కొరత లేకుండా, బ్లాక్ మార్కెట్‌ను అరికట్టేందుకు గాను తెలంగాణ వ్యవసాయ శాఖ కఠిన చర్యలు తీసుకోవడానికి రెడీ అవుతోంది. దీనిలో భాగంగా ఈ సారి నుంచి సాగు విస్తీర్ణం ప్రకరమే యూరియా పంపిణీ చేయనున్నారు. అంటే రైతులు ఎన్ని ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు అనే వివరాల ఆధారంగానే యూరియా పంపిణీ జరగబోతుంది. దీనికోసం రైతుల పట్టాదారు పాస్‌బుక్కుల నుంచి వివరాలు సేకరించి.. ఎంత యూరియా అవసరమో లెక్కలు తేల్చేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. రైతులు తాము సాగు చేసే పొలం విస్తీర్ణం కంటే ఎక్కువ యూరియా తీసుకోకుండా ప్రత్యేక యాప్‌ని అభివృద్ధి చేస్తున్నారు. గత నెల నుంచి ఆధార్ లింకుతో ఈ-పాస్ యంత్రాల ద్వారా యూరియా, ఇతర మందుల అమ్మకాలు జరుగుతున్నాయి. రైతుకు ఉన్న భూమికి ఎంత యూరియా అవసరమో అంతే తీసుకునేలా చర్యలు చేపట్టారు. దీని వల్ల.. అధికారులను తప్పుదోవ పట్టించి బ్లాక్‌లో అమ్మడం కోసం.. ఎక్కువ యూరియా తీసుకుంటే దొరికిపోతారు. దీని వల్ల బ్లాక్ మార్కెట్‌ను కట్టడి చేయవచ్చని భావిస్తున్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఈ సీజన్‌కు 10.40 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అవసరమని కేంద్రానికి లేఖ రాసింది. ఈ నెలాఖరు వరకు నెలకు 2 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయాలని కోరింది. అయితే, ఇప్పటివరకు రెండు నెలలకు సంబంధించిన యూరియా నిల్వల్లో సగం మాత్రమే రాష్ట్రానికి వచ్చిందని వ్యవసాయ శాఖ తెలిపింది. అక్టోబర్‌కు సంబంధించి 37 వేల మెట్రిక్ టన్నులు, నవంబర్ నెలకు సంబంధించిన 25 వేల మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రానికి చేరింది.

# మహానటి సావిత్రికి మరణం లేదు

ఈ కార్యక్రమానికి మంచి పేరు పెట్టారు. సావిత్రి జీవితం నుంచి ఎన్నో విషయాలు నేటితరం నేర్చుకోవచ్చు. నటిగా ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ సమాజ శ్రేయస్సు కోసం ఆమె పాటుపడ్డారు. కంటితో కోటి భావాలు, నవరసాలు పలికించే ఆమె నటన అద్భుతం అన్నారు. ప్రస్తుతం అలాంటి నటీమణులు లేరు. ఈ విషయం చెప్పడానికి నాకు ఏ సంకోచం లేదు. నేటి సినిమాల్లో



కథానాయికకు ప్రాధాన్యం తగ్గిపోతోంది. కుటుంబ విలువలు ఉన్న సినిమాలు రావడం లేదు. అభినయం ప్రదర్శించే కథానాయికలను వేళ్ల మీద లెక్క పెట్టి చెప్పవచ్చు. ప్రస్తుతం ఒకరిద్దరు అలాంటి నటీమణులు ఉన్నా, వారికి తగిన అవకాశాలు రావడం లేదు. సినీ ప్రముఖులు ఈ దిశగా ఆలోచించాలని వెంకయ్యానాయుడు సూచించారు. అలాగే మంచి సినిమా తీస్తే తనతో సహా అందరూ ఆదరిస్తారని, ఈ ప్రపంచంలోనే అత్యంత చవకైన వినోదం సినిమా మాత్రమేనని వెంకయ్యానాయుడు అన్నారు. తెలుగు సాహిత్యంలో ఉన్న ఎన్నో కథలను దర్శక-నిర్మాతలు ధారావాహికల రూపంలో నేటి తరానికి అందించాలని కోరారు. ఈటీవీ విన్ 'కథాసుధ' పేరుతో చేస్తున్న ప్రయత్నాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. సినిమా వ్యాపారమే అయినా, అది కళాత్మకమని నిర్మాతలు గుర్తు పెట్టుకోవాలన్నారు.. 'మహానటి' మూవీని అద్భుతంగా తీశారు. అశ్వనీదత్ కుమార్తెలు, ఆయన అల్లుడు నాగ్ అశ్విన్‌కు నా అభినందనలు. ఆ సినిమా చూస్తుంటే పాత రోజులన్నీ గుర్తు వస్తాయి. ప్రతి నిర్మాత ఇలాగే ఆలోచించాలి. మనవైన కథలు ఎన్నో ఉన్నాయి. మంచి సినిమా ఉంటే నాతో సహా అందరూ చూస్తారు. దగ్గుబాటి రానా నిర్మించిన '35: చిన్న కథ కాదు', దిల్‌రాజు కుమార్తె హన్షిత నిర్మించిన 'బలగం', కొణిదెల నిహారిక 'కమిటీ కుర్రాళ్ళు', సుకుమార్ కుమార్తె సుక్రీతి 'గాంధీతాత చెట్టు' ఇలా ఎన్నో చిత్రాలు ప్రేక్షకుల అభిమానం సొంతం చేసుకోవడంతో పాటు, అవార్డులు సొంతం చేసుకున్నాయన్నారు.

మన జీవనంలో అత్యంత చౌకగా లభించే వినోదం సినిమా. అప్పటి సినిమాల్లో హీరో-హీరోయిన్ ఒకరినొకరు తాకకుండా శృంగారాన్ని పండించేవారు. ఇప్పుడు తాకిన, గోకినా ఏం జరగడం లేదు. అంత తేడా వచ్చేసింది. సావిత్రిలాంటి నటికి మరణం లేదు. ఆమె మంచితనం కూడా చిర యశస్సు అందించింది. సినిమా వినోదం పాటు, సందేశానికీ ప్రాముఖ్యత ఇవ్వాలి. సందేశాత్మక సినిమాలు ఎవరు చూస్తారని అందరూ అనుకుంటున్నారు. రామోజీరావుగారు తీసిన సందేశాత్మక సినిమాలు ఆడలేదా? నేటి దర్శక-నిర్మాతలు ఆ అభిప్రాయాన్ని మార్చుకుని, కళాత్మక సినిమా తీయాలని కోరుకుంటున్నాఅని వెంకయ్యానాయుడు కోరారు. ఈ కార్యక్రమంలో తనికెళ్ల భరణి తదితర నటులు, సావిత్రి కూతురు విజయచాముండేశ్వరి పాల్గొన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
ఆదివారం 7 డిసెంబర్ 2025

# శ్రీను ఎలాఉంది పరిస్థితి..?

**మధురాపూరు సర్పంచ్ అభ్యర్థి బండి శ్రీనుతో ఎమ్మెల్యే ఆరా.. - ఆసక్తికరంగా మధురాపూర్ రాజకీయం**


**వైస్ చైర్మన్ బాబర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజు గౌడ్, చెంది తిరుపతిరెడ్డి తదితలతో సమావేశం..**





**ప్రజావినికిడి,(షాద్ నగర్):**
ఏంటి శ్రీను పరిస్థితి ఎలా ఉంది..? మధురాపురంలో ఎన్నికలు ఎలా సాగుతున్నాయి.. ప్రచారం బాగా జరుగుతుందా..? అంటూ షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ ఆరా తీశారు. శనివారం ఫరూక్ నగర్ మండలంలో పలు గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులకు మద్దతుగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనంతరం సాయంత్రం మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండ్రాతి బాలరాజ్ గౌడ్ కార్యాలయంలో కాసేపు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్,పట్టణ కాంగ్రెస్ సీనియర్ నాయకులు చెంది తిరుపతిరెడ్డి,మైనార్టీ నేత ఇబ్రహీం తదితరులు ఎమ్మెల్యేతో ఉన్నారు. ఈ సందర్భంగా మధురాపురంలో సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న యువ కాంగ్రెస్ నాయకులు పినమోని శ్రీనివాస్ అలియాస్ బండి శ్రీనును గ్రామ ప్రస్తుత రాజకీయాలు అదేవిధంగా పంచాయతీ ఎన్నికల విషయాలను ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. ఎన్నికలపై వారి మధ్య ఆసక్తికరమైన ముఖ్యమైన చర్చలు జరిగాయి. ఎన్నికల్లో అభ్యర్థుల మధ్య ప్రశాంత వాతావరణ ఉండాలని ప్రజలను మెప్పించి ఒప్పించే విధంగా ఓట్లు అడగాలని ఎలాంటి వివాదాలు లేకుండా ఎన్నికల్లో ముందుకు సాగాలని ఎమ్మెల్యే శంకర్ పలు సూచనలు సలహాలు బండి శ్రీనుకు అందజేశారు. ఎవరు గెలిచినా ఎవరు ఓడినా మంచి స్ఫూర్తి ప్రదర్శించే విధంగా గ్రామాల్లో రాజకీయ వాతావరణం ఏర్పడాలన్నారు.

# కాంగ్రెస్ పార్టీలోకి భారీ చేరికలు



**(కుత్బుల్లాపూర్): ప్రజావినికిడి,** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి అదేవిధంగా సంక్షేమ పథకాలకు 125 డివిజన్ గాజులరామారం పరిధిలోని సుభాష్ చంద్ర బోస్ నగర్ - బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ఆకర్షితులై మహమ్మద్ హనీఫ్ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి సమక్షంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ కండువా కప్పుకొని పార్టీలో చేరారు. ఈ సందర్భంగా హన్మంతన్న మాట్లాడుతూ,ప్రజా సంక్షేమమే ప్రభుత్వం లక్ష్యమని అన్నారు. ఆదేవింధంగా ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం ఆరు గ్యారెంటీలను ప్రభుత్వం అమలు చేస్తూ వస్తుందని, తెలిపారు. ప్రతి తెల్ల కార్డుదారునికి సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని గుర్తు చేశారు. ప్రభుత్వ%శీ% ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రేషన్ కార్డుల పంపిణీ,ఏ ప్రభుత్వం చేయని పనిని ప్రజా ప్రభుత్వం పేద ప్రజలకు అందించడం జరుగుతుందన్నారు. కాలనీ సంక్షేమ అభివృద్ధి లో తాను ఎల్లప్పుడు ముందు ఉంటానని తెలియచేసారు. పార్టీ లో చేరిన వారు నవీన్ గౌడ్,కృష్ణ గౌడ్,ప్రభు గౌడ్,ప్రశాంత్ కుమార్, మహమ్మద్ జైబుయిన్,విష్ణు వర్ధన్, ఎల్లయ్య,రాములు,వెంకటయ్య,మధుసూదన్ గౌడ్,ప్రభావతి , వెంకటమ్మ,హాలీ బేగం,నాగరాణి, అరుణ,లావణ్య, రాణి,పద్మమ్మ, యాదమ్మ,వనిత తదితరులు పాల్గొన్నారు.

# నాడు శ్రీకాంత్ చారి - నేడు సాయి చారి

**మరో తెలంగాణ ఉద్యమానికి నాంది పలికిన ఘటన!**



**ప్రజావినికిడి,(షాద్ నగర్):**
బీసీలకు రాజ్యాంగబద్ధ హక్కులు,న్యాయం, సమానత్వం కోసం వరుసగా బలిదానాలు జరుగుతున్నాయి. నాడు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం శ్రీకాంత్ చారి తన ప్రాణాలు అర్పించగా%నేడు బీసీలకు 42 శాతం రిజర్వేషన్ సాధన కోసం సాయి ఈశ్వర్ చారి ప్రాణత్యాగం చేశారు. ఇది ప్రతి బీసీ బిడ్డ ఆవేదనను, వేదనను,ప్రభుత్వాల నిర్లక్ష్యాన్ని స్పష్టంగా చూపిస్తున్న చేదు వాస్తవం. ఈ పరిస్థితుల్లో మరోసారి ప్రజల్లో ఆగ్రహం ఉప్పొంగిపోయింది. కొత్త తెలంగాణ ఉద్యమం నాంది పలికినట్లుగా రాష్ట్రం మొత్తం బీసీ బిడ్డలలో జ్వాలలు రాజేస్తున్నాయి. సాయి ఈశ్వర్ చారి మృతి అత్యంత బాధాకరమని,ఈ ఘటన ప్రభుత్వాలు తమ వైఖరిని మార్చుకునేలా చేయాలని డిమాండ్ చేస్తున్నాం. బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా చూసే రాజకీయాలు ఆగాలి. బీసీలకు హక్కుగా రావలసిన 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి. అదేవిధంగా సాయి చారి కుటుంబానికి తక్షణ ఆర్థిక సాయం,ఒక కుటుంబ సభ్యునికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కూడా మేము డిమాండ్ చేస్తున్నాం. ఇలాంటి బలిదానాలు పునరావృతం కాకుండా..బీసీలకు న్యాయం జరిగే వరకు మా పోరాటం ఆగదు. అవసరమైతే బీసీ బిడ్డలందరం ఏకమై తెలంగాణ ఉద్యమం తరహాలో మరొక పెద్ద ఉద్యమానికి సిద్ధమవుతామని స్పష్టం చేస్తున్నాం. సాయి చారి ఆత్మకు శాంతి చేకూరాలని దేవుణ్ణి ప్రార్థిస్తున్నాం. వారి కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతి..అని అన్నారు.

# "సఖి" ఎగ్జిబిషన్ ను ప్రారంభించిన బిఆర్ఎస్ ఎల్పీవిప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్



**ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):** కొంపల్లి మున్సిపాలిటీ పరిధి శ్రీ కన్వెన్షన్ నందు రెండు రోజుల పాటు నిర్వహించనున్న సఖి ఎగ్జిబిషన్ ను బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ప్రారంభించారు. ఈసందర్భంగావారుమాట్లాడుతూ, వినియోగదారుల అభిరుచులను అర్థం చేసుకుంటూ వ్యాపార్భివృద్ధిలో నూతనఉత్పత్తులను రూపొందించడంలో ఎగ్జిబిషన్ లు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్,బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి,మాజీ కౌన్సిలర్ పూజారి వసంత లక్ష్మణ్ గౌడ్, మహిళా అధ్యక్షురాలు సంగీతా రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# రేపటి నుంచి మెదక్ లో జరగబోయే సిఐటియు 5వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి




**ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):**
సిఐటియు కుతుబుల్లాపూర్ మండల కన్వీనర్ కీలు కానీ లక్ష్మణ్ జిల్లా కమిటీ సభ్యులు పసుల అంజయ్య
సిఐటియు ఐదవ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని సిఐటియు షాపూర్ నగర్ కార్యాలయం దగ్గర మహాసభల పోస్టర్ను విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ,ఈనెల ఏడవ తారీఖు నుండి 9వ తారీఖు వరకు మెదక్ పట్టణంలో 5 రాష్ట్ర మహాసభలు జరుగుతున్నాయని ఏడవ తారీఖు మధ్యాహ్నం బహిరంగ సభ జరుగుతుందని. ఈ బహిరంగ సభలో సిఐటియు కేంద్ర రాష్ట్ర నాయకులు పాల్గొంటారని అన్నారు. గడిచిన కాలంలో రాష్ట్రంలో జరిగిన కార్మిక ఉద్యమాలు. పోరాటాల ను సమీక్షించుకుని రానున్న కాలంలో కేంద్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ లకు వ్యతిరేకంగా పోరాడుతామని జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతంలో ఔట్సోర్సింగ్ కాంట్రాక్ట్ పద్ధతికి వ్యతిరేకంగా ఎస్ఐ పిఎఫ్ కనీస వేతనాలు అమలు చేయాలని వలస కార్మిక చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని అసంఘటిత రంగంలో పనిచేస్తున్న హమాలీ ఆటో భవన నిర్మాణ కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలని 60 సంవత్సరాల దాటిన అసంఘటిత రంగ కార్మికులకు కనీసం పదివేల పెన్షన్. కోసం పోరాడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కుత్బుల్లాపూర్ మండల నాయకులు మధు,కనకయ్య యాదవ రెడ్డి,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# భారత రాజ్యాంగానికి ప్రాణంపోసిన అపరమేధావి

**షాద్ నగర్ ఎమ్మెల్యే "వీర్లపల్లి శంకర్"**

**షాద్ నగర్ చౌరస్తాలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి నివాళులు**

**బిసి జనసేన ఆధ్వర్యంలో ఘనంగా వర్ధంతి**



**ప్రజావినికిడి,(షాద్ నగర్):**
అసమానతలు లేని సమాజం కోసం అనునిత్యం పరితపించి,భారత రాజ్యాంగానికి ప్రాణంపోసిన అపరమేధావి, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అని షాద్ నగర్ ఎమ్మెల్యే,రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ "వీర్లపల్లి శంకర్"అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణ కేంద్రంలో స్థానిక చౌరస్తా లో బిసి జనసేన ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. వర్ధంతి సందర్భంగా.. ఆ మహనీయుని సేవలను స్మరించుకుంటూ, ఆయనకివే మా ఘన నివాళు లు..అంటూ బీసీ జనసేన నాయకులు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా బీసీ జనసేన నాయకులు మాట్లాడుతూ, అంబేద్కర్ అందరికీ సమాన విద్య, ఆరోగ్యం,ఉపాధి, రక్షణ,నివాసం మరియు భావ ప్రకటనకు సమ న్యాయం రాజ్యాంగంలో పొందుపరిచిన భారత పిత డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ అని కొనియాడారు. సమ సమాజనిర్మాణంలో బాబాసాహెబ్ ను ప్రపంచ దేశాలు అలాగే ఐక్యరాజ్య సమితి "సింబల్ ఆఫ్ నాలెడ్జ్"గా గుర్తించారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిసి జనసేన సీనియర్ నాయకులు చందులాల్ జమాల్పూర్, ఉద్యమకారులు మేకల వెంకటేష్,తగిడిపల్లి శంకర్,జక్కుల జలజ, స్రవంతి రాజ్, భాగ్యలక్ష్మి, గడ్డమీది రమేష్,అదేవిధంగా కాంగ్రెస్ నాయకులు మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు విశ్వం,పట్టణ అధ్యక్షులు చెన్నయ్య, జర్నలిస్ట్ కొమ్ము వెంకన్న బాబు,దంగు శ్రీనివాస్ యాదవ్, యుటిఎఫ్ జనార్ధన్ నక్క బాలరాజ్ యాదవ్,మొన్నే రవి షర్ఫుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



# ఎంతకు బరి తెగించార్రా..!?

**ఎన్నికల్లో పోటీ చేస్తాడని "ఓటు" తీసేశారు**

**కంసాన్ పల్లి నుండి మొగలిగిద్దకు ఓటు మార్పిడి**


**ఇంత అన్యాయం ఏంటని ప్రశ్నిస్తున్న బాధితుడు ఎం.డి సలీం**


**ఎండి అంజద్ అనే వ్యక్తి నిర్వాకం**

**షాద్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేస్తానని చెప్పిన బాధితుడు సలీం**

**అడ్డు తొలగించుకుని ఎన్నికల్లో దర్జాగా పోటీ చేస్తున్న ఘనుడు**

**జరిగిన అన్యాయంపై బాధితుడు మీడియా సమావేశం**





**ప్రజావినికిడి,(షాద్ నగర్):**
ఎన్నికల్లో తనకు అడ్డు వస్తాడనో లేక తను అడ్డంగా ఉన్నాడనో భావించిన ఓ ప్రబుద్ధుడు ఓటరుకు ఎలాంటి సమాచారం లేకుండా అతని ఓటును ఏకంగా మరో ఊరికి అక్రమ రీతిలో మార్పిడి చేసిన ఘనుడి ఉదంతం ఇది. ఓటర్ బాధితుడు తన ఓటు మరో గ్రామంలో ఉందని తెలుసుకొని లబోదిబోమంటున్నాడు. పకడ్బందీగా ఓటును పక్క ఊరికి మార్పించి తాను మాత్రం ఎన్నికల్లో వార్డు సభ్యుడుగా పోటీ చేస్తున్న వ్యక్తి ఉదాంతంపై బాధితుడు శనివారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు.

**అసలు ఏం జరిగిందంటే..?**

రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం ఫరుక్ నగర్ మండలం కంసాన్ పల్లి గ్రామానికి చెందిన ఎండి సలీం అనే యువకుడు స్థానిక దేవి గ్రాండ్ హోటల్ లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో తనకు జరిగిన అన్యాయాన్ని వివరించాడు. ఎంతోకాలంగా గ్రామంలో ఉన్న తన ఓటు హక్కుకు అక్రమ పద్ధతిలో భంగం కల్పించి తనను ఎన్నికల్లో పోటీ చేయకుండా అదే విధంగా తన ఓటును మరో గ్రామానికి మార్చి తన రాజ్యాంగ స్వేచ్ఛకు పూర్తిగా వ్యతిరేకంగా వ్యవహరించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాడు. గ్రామంలో ఓటర్ జాబితాలో ఉన్న తన పేరును మండలంలోని మొగలిగిద్ద గ్రామానికి ఓటు మార్పిడి జరిగింది. గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సదరు వ్యక్తి ఎన్నికల్లో వార్డు సభ్యుడుగా పోటీ చేసేందుకు ఆసక్తిగా ఉండడంతో జాబితాలో పేరు కనిపించకపోయేసరికి ఆందోళన గురయ్యాడు. తన ఓటు జాబితాలో లేదని తెలుసుకొని అధికారులను సంప్రదించాడు. మండల రెవెన్యూ కార్యాలయంలో ఫిర్యాదు చేయగా ఆ తర్వాత ఆర్డీవో కార్యాలయంలో సమాచార హక్కు చట్టం కింద తన ఓటు మొగిలిగిద్ద గ్రామానికి ఎలా బదిలీ అయిందని తెలుసుకున్నాడు. అదే గ్రామానికి చెందిన ఎండి అంజాద్ అనే వ్యక్తి (షా జిరాక్స్ సెంటర్) ఆన్ లైన్ కమ్యూనికేషన్ సెంటర్ నుండి సలీం ఓటును మొగలిగిద్దకు మార్చే విధంగా దరఖాస్తు చేశాడు. ఓటరుకు సంబంధం లేకుండా సలీం ఓటును ఇతర గ్రామానికి మార్చిన విషయం అధికారులు ఇచ్చిన సమాచారం ద్వారా తెలుసుకొని షాక్ అయ్యాడు.

**ఇదేం అన్యాయం..?**

బాధితుడు సలీం మీడియా సమావేశంలో మాట్లాడుతూ,ఇదేం అన్యాయం అని ప్రశ్నించాడు. ఎన్నికల్లో తను స్వేచ్ఛగా ఓటు వేయకుండా తన గ్రామంలో వార్డుకు పోటీ చేయకుండా తన హక్కును హరించిన అంజాద్ అనే వ్యక్తిపై ప్రభుత్వం చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని అదేవిధంగా పోలీసులకు కూడా ఫిర్యాదు చేయబోతున్నట్లు తెలిపారు. ఇతనిపై చట్టపరంగా కేసు నమోదు చేయించి చర్యలు చేపట్టాలని బాధితుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాడు. ప్రతి వ్యక్తికి రాజ్యాంగ కల్పించిన హక్కు ఓటు హక్కు అని ఆ ఓటును అక్రమ పద్ధతిలో ఇతర గ్రామానికి బదిలీ చేయించి తన హక్కును హరించిన అంజద్ పై పూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాడు. అంతేకాదు అతని కమ్యూనికేషన్ సెంటర్ ద్వారా చాలామంది ఓట్లను తన స్వార్థ ప్రయోజనాల కోసం మార్పిడి చేశాడని ఇతనిని విచారిస్తే మరిన్ని ఆన్లైన్ మోసాలు బయటపడతాయని తెలిపారు. ఇలాంటి వ్యక్తిపై ఎన్నికల్లో అధికారులు చర్యలు చేపట్టాలని లేకపోతే ఎన్నికల్లో అక్రమ పద్ధతిలో గెలిచే అవకాశం ఉందని ప్రజలను కూడా మోసం చేసే ఆస్కారం ఉందని బాధితుడు వాపోయాడు. ఇలాంటి వ్యక్తిని గ్రామస్తులు కూడా దూరం పెట్టాలని ఈ ఎన్నికల్లో అతని ఓడించాలని బాధితుడు పిలుపునిచ్చాడు. కంసాన్పల్లి ఐదో వార్డులో అంజాద్ పోటీ చేస్తున్నాడని బాధితుడు మీడియాకు వివరించారు. ఒక వ్యక్తికి ఉన్న స్వేచ్ఛను హరించి ఇంత అఘాయిత్యానికి పాల్పడిన వ్యక్తిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సలీం డిమాండ్ చేశారు. ప్రస్తుతం మొగలిగిద్దలో తన ఓటు ఉండటంతో ఆ గ్రామస్తులు తన ఓటు వేయాల్సిందిగా కొంతమంది అభ్యర్థులు అడుగుతున్నారని సలీం వాపోయారు.

# ఆదర్శనగర్ ఆడిటోరియంలో ఘనంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి వేడుకలు





**ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా రాజ్యాంగ పరిరక్షణ సదస్సు నేషనల్ దళిత సంఘం జాతీయ అధ్యక్షులు డాక్టర్ బుధాల అమర్ బాబు అధ్యక్షతన ఆదర్శనగర్ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కొలన్ హనుమంత రెడ్డి పాల్గొని మాట్లాడుతూ, భారతదేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత పటిష్టమైన మన రాజ్యాంగం నిర్మించిన అంబేద్కర్ ఆశయ సాధన కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం బిజెపి ప్రభుత్వం దళితులపై దాడి చేస్తుందని రాజ్యాంగాన్ని మార్చి మను వాదాన్ని ప్రవేశపెట్టాలని ఆర్ఎస్ఎస్ ప్రయత్నిస్తుందని గత ప్రభుత్వం దళితులను పట్టించుకోలేదని అన్నారు. సామాజిక న్యాయం కోసం ఎస్సీ వర్గీకరణ బీసీ రిజర్వేషన్ అమలు చేస్తూ, రేవంత్ రెడ్డి ప్రజా పాలన ప్రజాపాలన కొనసాగుతుందని అన్నారు. రాజ్యాంగం ప్రకారం ప్రతి పేదవాడికి న్యాయం జరుగుతుందని ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలకు సామాజిక న్యాయం కాంగ్రెస్ తో సాధ్యమని అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు మమేకమై మన హక్కులను కాపాడుకోవాలని అదే మనం ఆయనకి ఇచ్చే గొప్ప బహుమతి అని గుర్తు చేశారు. హిందువులకు భగవద్గీత, క్రైస్తవులకు బైబిల్ అలాగే మహమ్మదీయులకు ఖురాన్ ఎలాగో ప్రతి ఒక్క భారతీయుడికి భారత రాజ్యాంగం అంతే పవిత్రమైనదని.. రాజ్యాంగాన్ని చదివి మన హక్కులను తెలుసుకోవాలని రాజ్యాంగాన్ని చేతపట్టి రాజకీయం నేర్చుకోవాలని రాజ్యాంగాన్ని కాపాడి మనల్ని మనం కాపాడుకోవాలి అని నినాదంతో సదస్సుకు విచ్చేసిన ప్రతి ఒక్కరికి అంబేద్కర్ భారత రాజ్యాంగం పుస్తకాన్ని అందజేశారు.

అనంతరం ఆయన వర్ధంతిని పురస్కరించుకొని పారిశుద్ధ్య కార్మికులకు, మహిళలకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నేషనల్ దళిత సేన సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు డాక్టర్ బుధాలఅమర్ బాబు, జాతీయ ఉపాధ్యక్షులు బాబురావు, రాష్ట్రీయ దళిత సేన ఓబీసీ జాతీయ అధ్యక్షులు గూడ ఐలయ్య గౌడ్, అఖిల భారత రాష్ట్రీయ దళిత సేన అధ్యక్షులు అవిజే జమ్స్, దళితసేన ప్రధాన కార్యదర్శి వై. బాలరాజు రాష్ట్రీయ దళిత సేన జాతీయ మహిళ అధ్యక్షురాలు ఆర్ లక్ష్మి, కాంగ్రెస్ పార్టీ మాజీ కౌన్సిలర్ గూడవరమ్మ, యువజన విభాగం అధ్యక్షులు ఆనంద్ బాబు, 126 కాంగ్రెస్ అధ్యక్షులు కే. గణేష్ 127 కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు బి. శివకుమార్, మాధవి, రాణి, కమల దళిత నాయకులు హనుమకొండ ప్రేమ్ కుమార్, విజయ భాస్కర్ రావు, సిద్ధన్న, బూరుగుర్ రవి, కళాకారుల శంకర్ బృందం, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

# డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు నివాళులు అర్పించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



**ప్రజావినికిడి,(ఎల్బీనగర్):** భారత రాజ్యాంగ పితామహుడు డా. బి. ఆర్. అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి శనివారం రోజు ఎల్బీనగర్ లోని కామినేని కూడలి వద్ద ఉన్న వారి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాన్సూరాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, సీనియర్ నాయకులు ఓరుగంటి వెంకటేష్, డివిజన్ భారస పార్టీ అధ్యక్షులు జక్కిడి మల్లారెడ్డి, నర్సింహారావు, రుద్ర యాదగిరి, నర్సింహా గౌడ్, చంద్రమౌళి, సల్వాచారి తదితరులు పాల్గొన్నారు.

## భవనం నిర్మాణ కార్యక్రమంలో పాల్గొన్నఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



**ప్రజావినికిడి,(ఎల్బీనగర్):** మాన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని లెక్చరర్స్ కాలని నివాసితుల సంక్షేమ సంఘ మొదటి అంతస్తు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి.. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, డివిజన్ భారస పార్టీ అధ్యక్షులు జక్కిడి మల్లారెడ్డి, మాజీ అధ్యక్షులు జగదీష్ యాదవ్, యువ నాయకులు జక్కిడి రఘువీర్ రెడ్డి, కాలనీ అధ్యక్షులు కొప్పుల శ్రీనివాస్ రెడ్డి, ఉపాదక్షులు భీమిడి వెంకట్ రెడ్డి, రవికుమార్ గౌడ్, ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య, రామస్వామి గౌడ్, సంయుక్త కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, సుదర్శన్, కోశాధికారి సంతోష్ కుమార్ మరియు పలువురు నాయకులుకాలనీవాసులు పాల్గొన్నారు


# స్ఫూర్తితో కూడిన క్రీడలు భావితరాలకు అందించాలి

**టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు - షాద్ నగర్ లో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి క్రికెట్, కబడ్డీ పోటీల పోస్టర్ విడుదల**

**హాజరైన రాష్ట్ర ఎస్టీసెల్ ఉపాధ్యక్షుడు రమావత్ నరేష్ నాయక్, కార్యాలయ కార్యదర్శి పిట్టల శ్రీనివాస్**






**ప్రజావినికిడి,(షాద్ నగర్):** అసమానతలు, లింగ వివక్ష లేని సంస్కృతిని పెంపొందించడం ద్వారా స్ఫూర్తితో కూడిన క్రీడలు భావితరాలకు అందించాలనీ టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు పిలుపునిచ్చారు. స్వర్గీయ నందమూరి తారకరామారావు 103వ జయంతిని పురస్కరించుకొని మొట్ట మొదటి సారిగా ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి క్రికెట్, కబడ్డీ పోటీలకు సంబంధించిన వాల్ పోస్టర్లను మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం కేంద్రంలో విడుదల చేశారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు రమావత్ నరేష్ నాయక్, కార్యాలయం కార్యదర్శి పిట్టల శ్రీనివాస్, ఫరూక్ నగర్ మాజీ ఎంపీపీ చల్లా వెంకటేశ్వర రెడ్డి, తదితర టిడిపి నాయకులతో కలిసి పోస్టర్ ఆవిష్కరించిన అనంతరం మాజీ ఎమ్మెల్యే బక్కని మాట్లాడుతూ, 'కృషి వుంటే మనుషులు ఋషులవుతారు మహాపురుషులౌతారు తరతరాలకి తరగని వెలుగవుతారు ఇలవేలుపులౌతారు' సినీ కవి వేటూరి మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ కోసం ఒక పాట రాశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. క్రీడల్లోను, జీవితంలోనూ కృషి, పట్టుదల సంక్లిష్టమైన ప్రపంచంలో మనిషిగా నిలబెడుతుందనీ అన్నారు. అదే విధంగా క్రీడలు ఉన్నత శిఖరాలను అధిరోహింపజేస్తుందనీ వివరించారు. స్వర్గీయ ఎన్ టి రామారావు పేరిట క్రీడోత్సవాలు నిర్వహించడం అయిన 12వ జయంతి సందర్భంగా పెద్ద ఎత్తున ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇలాంటి కార్యక్రమాన్ని చేపట్టినందుకు ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొట్టమొదటిసారిగా క్రికెట్ కబడ్డీ పోటీలు స్వర్గీయ ఎన్టీ రామారావు పేరిట నిర్వహించడం శుభ పరిణామం అని అన్నారు. డిసెంబర్ 31 నాటికి క్రీడాకారులు రిజిస్ట్రేషన్ చేసుకునే చివరి తేదీ అని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. క్రికెట్ బహుమతుల్లో కూడా మొదటి బహుమతి రెండు లక్షలు రెండో బహుమతి ఒక లక్ష, మూడో బహుమతి 50వేల రూపాయలు అందించడం విశేషం అన్నారు.

ఎన్టీఆర్ పేరిట క్రీడలు నిర్వహించి భవిష్యత్తు తరాలకు క్రీడలను ప్రోత్సహించడం అభినందనీయమని నిర్వాహకులను అభినందించారు. ఎంతో శ్రమపడి ఇక్కడికి వచ్చిన నిర్వాహకులు ఈ కార్యక్రమాన్ని తన చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరణ చేయించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చల్ల వెంకటేశ్వర రెడ్డి, స్థానిక నాయకులు మాజీ ఎంపిటిసి భాస్కర్ గౌడ్, అనంతయ్య, భూపాల్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులతో దద్దరిల్లిన అసెంబ్లీ




**ప్రజావినికిడి,(రామంతపూర్): ప్రతినిధి,డిసెంబర్ 6,** విద్యార్థులతో స్కూల్ లో ఏర్పాటు చేసిన అసెంబ్లీ దద్దరిల్లిన ఘటన శనివారం సెయింట్ జోన్స్ పాఠశాలలో చోటుచేసుకుంది. రామంతపూర్ భరత్ నగర్ లో గల సెయింట్ జోన్స్ హై స్కూల్లో తెలంగాణ అసెంబ్లీని తలపించేలా విద్యార్థులు స్కూల్ ఆవరణంలో నిర్వహించిన స్వయం అసెంబ్లీ సమావేశం అందరినీ ఆకట్టుకుంది. ప్రభుత్వాన్ని తలపించేలా స్పీకర్, సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేల హవ భావాలు ఎలా ఉంటాయో అలా కన్నుల కట్టినట్లు ప్రదర్శించారు. అలాగే ప్రతిపక్ష స్థానంలో విద్యార్థులు ఎమ్మెల్యేలుగా ప్రతిపక్ష హోదాలో సంధించిన ప్రశ్నలు ఆహుతులను మంత్రముగ్ధులను చేశాయి. ప్రజలకు ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలను ఎలా అమలు చేయాలో ప్రభుత్వ హోదాలో ఉన్న విద్యార్థులు చక్కగా వివరించారు. అలాగే ప్రభుత్వాలు చేస్తున్న తప్పిదాలను ప్రతిపక్ష హోదాలో కూర్చున్న విద్యార్థులు విమర్శించిన తీరు చాలా చక్కగా ఉంది. విద్యార్థి దశ నుంచే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా వారిలో రాజకీయాల పట్ల అవగాహన పెరిగి విద్యార్థులు కూడా రాజకీయాలలోకి వచ్చి ప్రజలకు సేవలు అందించి నవ సమాజ నిర్మాతలుగా మారుతారని పాఠశాల ప్రిన్సిపాల్ సూరం రామిరెడ్డి పేర్కొన్నారు. ఈ వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించిన టీచర్స్ ని, విద్యార్థులను పాఠశాల వైస్ ప్రిన్సిపల్ సూరం మమత రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

# మదనపల్లి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా..

**బ్యాట్ గుర్తును గెలిపించాలని జోరుగా ప్రచారం.. - సర్పంచ్ అభ్యర్థి పండాల లత ఆంజనేయులు గౌడ్..**






**ప్రజావినికిడి,(శంషాబాద్):డిసెంబర్ 6:** మదనపల్లి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని, బ్యాట్ గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని మదనపల్లి సర్పంచ్ అభ్యర్థి పండాల లత ఆంజనేయులు గౌడ్ అన్నారు. ఈ మేరకు శనివారం సాయంత్రం మదనపల్లి, గచ్చిబాయ్ తండాలో వివిధ బస్తీలతో పాటు అనుబంధమైన తండాలో ఆమె విరివిగా తిరుగుతూ, ప్రచారం నిర్వహించారు. తన బ్యాట్ గుర్తును అందరికీ చూపిస్తూ తప్పకుండా బ్యాట్ గుర్తుపై ఓటు వేసి తనను భారీ మెజారిటీతో సర్పంచిగా గెలిపించాలని గ్రామస్తులను కోరారు. మీడియా సమావేశంలో పండాల లత ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ, గతంలో తాను వార్డు మెంబర్ గా పని చేశానని తన భర్త ఉప సర్పంచ్ గా పనిచేశారని మదనపల్లి గ్రామంలో గచ్చిబౌలి తండాలో సిసి రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు, కరెంటు స్తంభాలు వంటి సేవలు అందించమన్నారు మదనపల్లి నుండి జుకల్ వరకు రోడ్డు వేయంచం అని అన్నారు. గ్రామాన్ని అభివృద్ధి చేయలేదని కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని వాటిని నమ్మకూడదు అన్నారు. గత పంచాయతీలో ఉపసర్పంచ్ తన భర్త ఆంజనేయులు గౌడ్ ఎన్నో పనులు చేశాడని చెప్పారు. కనబడుతున్న అనుభవంతో మదనపల్లి గ్రామాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తానన్నారు. గ్రామంలో సమస్యలన్నిటిని ఒక్కొక్కటిగా గుర్తించి వాటిని అంచ లంచలుగా పరిష్కారం చేసి గ్రామాన్ని శంషాబాద్ మండలంలోని ఆదర్శ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దుతానని ఆమె చెప్పారు గ్రామంలోని అందరూ తనకు మద్దతు పలుకుతున్నారని ముఖ్యంగా మహిళలందరూ ఎంతో సంతోషంగా ప్రచారంలో పాల్గొంటారని వారి అందరి ఆశీస్సులు తనకు లభిస్తున్నాయి గనుక తాను ఈ ఎన్నికల్లో తప్పకుండా విజయం సాధిస్తానని ఆశ కలుగుతుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు ఈనెల 11వ తేదీన జరగనున్న ఎన్నికల్లో బ్యాట్ గుర్తుపై ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆమె కోరారు.

# పెద్ద షాపు ర్ గ్రామ అభివృద్ధి నా లక్ష్యం..

**కత్తెర గుర్తుకు ఓటేసి భారీ మెజారిటీతో గెలిపించండి..**

**సర్పంచ్ అభ్యర్థి దేవరపల్లి సత్యనారాయణ సునీత గౌడ్..**




**ప్రజావినికిడి, (శంషాబాద్):డిసెంబర్ 6:** శంషాబాద్ మండల పరిధిలోని పెద్దషాపూర్ గ్రామాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడం తన లక్ష్యం అని కత్తెర గుర్తుకు ఓటేసి భారీ మెజారిటీతో గెలిపించాలని సర్పంచ్ అభ్యర్థి దేవరపల్లి సునీత సత్యనారాయణ గౌడ్ అన్నారు. శనివారం పెద్ద షాపూర్ గ్రామంలో వార్డు వార్డుకు తిరుగుతూ గ్రామంలోని దుకాణాల వద్ద తన గుర్తును ప్రదర్శిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ గ్రామానికి తన భర్త గతంలో సర్పంచిగా విధులు నిర్వహించారని ఆయన చూపించే అనుభవంతో గ్రామాన్ని సమస్యలు లేకుండా పూర్తిస్థాయిలో పరిష్కరిస్తానన్నారు కత్తెర గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని ఓటర్లందరికి కోరారు.

## పెద్ద తూప్రాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా..

### సర్పంచ్ అభ్యర్థి దిద్యాల సరదా యాదగిరి..





**ప్రజావినికిడి, (శంషాబాద్):డిసెంబర్ 6:**పెద్దతూప్రా గ్రామాన్ని మండలంలోని ఆదర్శ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దుతానని బాల్ గుర్తుపై ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని సర్పంచ్ అభ్యర్థి దిద్యాల సరదా యాదగిరి అన్నారు. శనివారం నాడు గ్రామంలో గల్లి గల్లి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు, పెద్ద తుప్రా గ్రామంలోని సమస్యలన్నీ తన కుటుంబానికి తెలుసు అని ఆ అనుభవంతో గ్రామాన్ని అభివృద్ధి చేయడానికి వీలు కలుగుతుందన్నారు ప్రజలు ఎవరైనా తమ తమ బస్తీల్లో ఉన్న సమస్యలను నిర్భయంగా తనకు తెలిపితే వాటిని తప్పకుండా పరిష్కరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో యాదగిరి సీనియర్ నాయకులు అభిమానులు పాల్గొన్నారు.

## పాలమాకుల గ్రామ అభివృద్ధి నా లక్ష్యం

### ఉంగరం గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించండి

### పాలమాకుల సర్పంచ్ అభ్యర్థి కోటేశ్వర్ గౌడ్

**ప్రజావినికిడి, (శంషాబాద్):డిసెంబర్ 6:**శంషాబాద్ మండల పరిధిలోని పాలమాకుల గ్రామాన్ని పూర్తిస్థాయిలో







అభివృద్ధి చేయడం తన లక్ష్యం అని ఉంగరం గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని పాలమాకుల సర్పంచ్ అభ్యర్థి కొట్కూరి కోటేశ్వర్ గౌడ్ అన్నారు. కోటేశ్వర్ గౌడ్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. గతంలో పది సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేదని అప్పుడు ఇక నాయకులు గ్రామాన్ని ఏమీ అభివృద్ధి జరపలేదన్నారు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 18 నెలల్లో పాలమాకుల లో ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయి అన్నారు రెండు కోట్ల యాభై లక్షలు రోడ్ల కోసం 100 లక్షలు డ్వాక్రా మహిళలకు ప్రభుత్వం ఖర్చు చేయడం జరిగిందన్నారు బిఆర్ఎస్ కాలంలో ఒకరికి కూడా డబ్బుల్ బెడ్ రూమ్ రాలేదన్నారు 200 ఉన్న రేషన్ కార్డులను 1500 చేశామన్నారు ఈ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని పాలమాకుల గ్రామస్తులు తనను తప్పకుండా గెలిపిస్తారని తనకు ఆశాభావం కలుగుతుందన్నారు మరికొన్ని ఏరియాలో సీసీ రోడ్లు లేవని అక్కడ కూడా సిసి రోడ్లు ఇస్తామన్నారు అంబేద్కర్ కాలనీలో రోడ్లు డ్రైనేజీ వ్యవస్థ బాగా దెబ్బతిన్నదని నేను అధికారంలోకి వచ్చాక వాటిని పూర్తి చేస్తానని అన్నారు ఇండ్లపై ఉన్న విద్యుత్ తీగలను తీపిస్తామన్నారు పాలమాకుల లో ఉన్న వాటర్ సమస్యను తప్పకుండా తీరుస్తామన్నారు. గతంలో కొన్ని ప్రాంతాల్లో తన సొంత నిధులతో సొంతంగా బోర్లు వేయించి వీటిని సరఫరా చేయించామన్నారు తాను గెలిచిన తర్వాత ప్రతి వార్డులో ఎప్పటికప్పుడు సమస్యలు తెలుసుకుని సమస్యలన్నీ పరిష్కరించి పాలమాకుల గ్రామాన్ని ఒక ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు.

# దత్తపుత్రుడు దగా చేశాడు..

### మొగిలిగిద్ద ప్రచార సభలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్.. ఎల్లంపల్లి, రంగంపల్లి,కంది వనంలో ప్రచారం..

### తన మద్దతుదారులను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి.. - కేశంపేట మండలంలో ఎమ్మెల్యే పర్యటన..

### ఇప్పలపల్లి, పోమాలపల్లి, కాకునూరు గ్రామాల్లో కాంగ్రెస్ మద్దతుదారులకు ప్రచారం..









**ప్రజావినికిడి,(షాద్ నగర్):**
దత్తపుత్రుడు అంటూ రంగంలోకి వచ్చాడు.. కానీ మీ గ్రామాన్ని పట్టించుకున్న పాపాన పోలేదు..ఇప్పుడు నేను వచ్చాను.. సీఎంను కూడా గ్రామానికి తెచ్చాను..త్వరలో మీ గ్రామం రూపురేఖలు మార్చేస్తాను..అంటూ షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఓటర్లకు హామీ ఇచ్చారు. ఫరూక్ నగర్ మండలం మొగిలిగిద్ద గ్రామంలో ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా గత పాలకుల తీరును విమర్శిస్తూ ప్రచార పదును పెంచారు.ఈ సందర్భంగా మొగలిగిద్ద గ్రామంలో ప్రధాన రహదారులపై వ్యాపారులను కలిసి కాంగ్రెస్ మద్దతుదారు అంబటి రాజును గెలిపించాలని ఓటర్లను కోరారు.ఈ సందర్భంగా ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ, మొగిలిగిద్ద గ్రామంలో సమస్యలు ఉన్నాయని,పాఠశాల పరిస్థితి అధ్వాన్నగా ఉందని ఉపాధ్యాయులు చెప్పిన వెంటనే సంబంధిత మంత్రులతోనూ, నేరుగా ముఖ్యమంత్రితో కూడా మాట్లాడానని వివరించారు.ఈ క్రమంలోనే గ్రామానికి వచ్చిన ముఖ్యమంత్రి గ్రామ పాఠశాల అభివృద్ధి తోపాటు, గ్రామాభివృద్ధికి కూడా నిధులు కేటాయించారని గుర్తు చేశారు.నీతిగా నిజాయితీగా ముందుకు సాగే అంబటి రాజును గెలిపిస్తే గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. అనంతరం మండలంలోని ఎల్లంపల్లి,రంగంపల్లి, కందివనం గ్రామాలలో ఆయన ప్రచారాన్ని నిర్వహించారు.ఆయా గ్రామాల అభ్యర్థులతో పాటు నేతలు మొహమ్మద్ అలీ ఖాన్ బాబర్,కృష్ణారెడ్డి,చల్లా శ్రీకాంత్ రెడ్డి,చెంది తిరుపతి రెడ్డి,ఎండి ఇబ్రహీం,ముబారక్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

### కేశంపేట మండలంలో పర్యటన

కిషన్ పేట మండలం ఇప్పలపల్లి పోమాలపల్లి కాకునూరు గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులకు మద్దతుగా స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ భారీ ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు.ఇప్పలపల్లి గ్రామంలో స్వప్న హెూమలపల్లి లో మంజుల రమేష్ అదేవిధంగా కాకునూరులో లింగం కు మద్దతుగా ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపిస్తే ఆయా గ్రామాలను పెద్ద ఎత్తున





సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలతో ప్రగతి పథంలో పరుగులెత్తిస్తానని ఎమ్మెల్యే శంకర్ భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా మండల మాజీ జెడ్పిటిసి విశాల,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్, సీనియర్ నాయకులు చెంది తిరుపతిరెడ్డి,మైనార్టీ నేత ఇబ్రహీం,శ్రావణ్ రెడ్డి,శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అంతే మా ఇష్టం

### సంక్షేమ సంఘం ముసుగులో రాజకీయ లబ్ధి..

### కమ్యూనిటీ హాల్ కు సంబంధించిన లక్షల రూపాయలు స్వాహా..






**ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):**
నిజాంపేట్ బండారి లేఅవుట్ 2016లో వచ్చిన వరదల వలన ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ప్రాంతం..సహజంగా కాలనీ సంక్షేమ సంఘం అనేది ఆ కాలనీలో మౌలిక వసతుల కల్పనకు ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి ఉపయోగపడే సాధనంగా కాలనీ సంక్షేమ పెద్దలు వ్యవహరిస్తారు.కానీ 2015లో మొట్టమొదటిసారిగా బండారి లేఅవుట్ సంక్షేమ సంఘం పేరుతో ఏర్పాటు చేయబడిన కాలనీ సంక్షేమ సంఘం కొంతమంది చేతిలో అధికారాన్నిహస్తగతంచేసుకోవడానికి ఒక సాధనంగా మారిపోయింది సంక్షేమ సంఘం రిజిస్ట్రేషన్ టైం లో ఏర్పాటు చేయబడిన బైలాసును తుంగలో తొక్కి లైఫ్ టైం మెంబర్షిప్ పేరుతో ఒక్కొక్క సభ్యుని నుండి 1000 వసూలు దాదాపు 1500 పైచిలుకు సభ్యుల నుండి 15 లక్షల వరకు వసూలు చేసి వివిధ ఖర్చులను చూయించి సొమ్మును స్వాహా చేయడం జరిగింది. ప్రభుత్వ నిధులతో కట్టించిన కమ్యూనిటీ హాల్ ఆదాయం పైన లెక్క పత్రం లేకుండా పోయింది కాలనీకి అనుకొని ఉన్న తురకచెరువు సంక్షేమ సంఘం పెద్దలకు ఒక అక్షయ పాత్రగా దొరికింది గడచిన ఐదారు సంవత్సరాల లోనే కేవలం గుర్రపు డెక్క అలాగే చెరువు సుందరీకరణ పేర్లతో దాదాపు కోటి యాభై లక్షలకు పైగా క్లేమ్ చేసి ప్రస్తుతం యధావిధిగా చెరువులో గుర్రపు టెక్క తేలియాడుతుందంటే సంక్షేమ సంఘం ఏ విధంగా పనిచేసిందో కాలనీ ప్రజలు అర్థం చేసుకోవాలి అలాగే పార్కుల అభివృద్ధి పేరట దోపిడీ గోపి ఐఏఎస్ కార్పొరేషన్ కమిషనర్ గా ఉన్నప్పుడు శ్రీరాములకుంట పార్కును ఎంట్రీ టికెట్ పేరుతో వస్తువుల దందాకు తెరలేపడం జరిగింది కానీ మా ఒత్తిడితో టికెట్ ప్రయత్నాలు విరమించుకోవడం జరిగింది ఇప్పటికీ అక్కడ అక్రమంగా వెలిసిన కొన్ని డబ్బాల నుండి ప్రతినెల డబ్బులను కూడా టిఆర్ఎస్ నేతలు వసూలు చేసుకుంటున్నారు ఇలా కాలనీకి సంబంధించిన డ్రైనేజీ మూతల నుండి బిల్డింగుల వరకు ప్రతి పనిలో అవినీతి అక్రమాలకు పాటుపడిన కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు అని చెప్పుకుంటున్న బిఆర్ఎస్ నేతలు సంక్షేమ సంఘం పేరుతోనే అధికారాన్ని కూడా అనుభవించారు ఏ ఒక్క దానికి లెక్కలు పత్రాలు లేవు కనీసం కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను వాట్సప్ గ్రూపులలో పోస్ట్ చేయడానికి అలాగే అభిప్రాయాన్ని వ్యక్తపరచడానికి కూడా అవకాశం లేకుండా కాలనీ ప్రజల గొంతు నొక్కడం ఎవరైనా వారిని ప్రశ్నిస్తే గ్రూపులలో నుండి రిమూవ్ చేయడం వారికి పరిపాటే.జనవరి 2025 వరకు అందరూ కలిసికట్టుగా కాలనీలలోని ఏ కమిటీ అయినా వాళ్లే ప్రెసిడెంట్ వాళ్లే సభ్యులు అందరూ కలిసి కట్టుగా వాటాలు పంచుకున్నారు చివరికి కాలనీలోని శ్రీ దక్షిణ ముఖ ఆంజనేయ స్వామి టెంపుల్ కమిటీలలో కూడా అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని ప్రస్తుత ఆలయ కమిటీ నిర్ధారించడం గురించి కాలనీవాసులు బహిరంగంగానే చెప్పుకుంటున్నారు.నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ ప్రజల డబ్బులతో నిర్మించినటువంటి కమ్యూనిటీ హాలును ఓపెన్ టెండర్ ద్వారా అప్పగించాలని వివిధ వినతపత్రాలు సమర్పించిన తర్వాత తిరిగి కాలనీకి సంబంధించిన ఒక బీఆర్ఎస్ నేత స్థానిక ఎమ్మెల్యే అండదండలతో ఓపెన్ టెండర్ ద్వారా ప్రస్తుత కమిటీ హాల్ను దక్కించుకోవడం జరిగింది.కానీ టెండర్ పిలవడానికి అంటే ముందు కేవలం దాదాపు ఒకటి రెండు సంవత్సరాలకే కమ్యూనిటీ హాల్ ఆదాయం దాదాపు 15 లక్షల వరకు వసులైందని ఈ డబ్బును ఇప్పటికీనలుగురు వ్యక్తుల వద్ద ఉందని కేవలం రెండు సంవత్సరాలకే 15 లక్షలు వసూలైతే గత కొన్ని సంవత్సరాలుగా ఎంత డబ్బు వసూలైందో కాలనీ ప్రజలు అర్థం చేసుకోవాలని పంపకాలలో తేడా వచ్చిందో మరి ఇతర కారణమేమో తెలియదు కానీ ఇప్పటివరకు కలిసి ప్రయాణించిన స్థానిక టిఆర్ఎస్ నేతలు మరియు సంక్షేమ సంఘం సభ్యులు గత 15 సంవత్సరాలుగా కాలనీ అంటే మేము మేము అంటే కాలనీ అని చెప్పుకుంటూ మేము ఉన్నన్ని రోజులు మళ్లీ మమ్మల్ని సంక్షేమ సంఘం ప్రెసిడెంట్గా సభ్యులుగా ఎన్నుకోవాలని ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారు నిత్యం ఆఫీస్ వర్క్ లతో హడావిడిగా ఉండే అపార్ట్మెంట్ వాసులు ఎలాగో వచ్చి ప్రశ్నించరు అని ధైర్యం ఆ నేతలదై ఉండొచ్చు.. ఇప్పటికైనా కాలనీవాసులు మేల్కొని కాలనీ అభివృద్ధిలో అందరూ భాగస్వాములు అయ్యేవిధంగా కమిటీ రూపకల్పన జరగాలని గత 15 సంవత్సరాలుగా సంక్షేమ సంఘం ముసుగులో కాలనీ అభివృద్ధి పనులలో వివిధ కమిటీలలో జరిగిన అవకతవకల పైన విజిలెన్స్ కమిషన్ ద్వారా విచారణ జరిపే విధంగా చర్యలు తీసుకోవాలని బండారి లేఅవుట్ కాలనీవాసుడిగా బిక్షపతి యాదవ్ అతని సహచర టీం డిమాండ్ చేస్తుంది..

## నాగోల్ శుభం కన్వెన్షన్ లో వి 4 ఈవెంట్స్ ఘనంగా ప్రారంభం



**ప్రజావినికిడి,(నాగోల్):డిసెంబర్,6**
మహిళలకు ఆర్థిక స్వాలంబన అవసరమని నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణా సురేందర్ యాదవ్ అన్నారు.ఈ సందర్భంగా శనివారం నాగోల్ డివిజన్ పరిధిలోని శుభం కన్వెన్షన్ హాల్ లో నిర్వహించిన కె ఎస్ ఎస్ ఆర్ వారి వీ4 ఈవెంట్స్ ఘనంగా మొదలైంది.ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్,కొత్తపేట కార్పొరేటర్ నాయి కోటి పవన్ కుమార్ అతిథులుగా హాజరైయ్యారు.ఈ సందర్భంగా కార్పొరేటర్లు కార్యక్రమంలో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను సందర్శించి, హస్తకళలు, హ్యాండ్లూమ్ వస్త్రాలు, జ్యువెలరీ స్టాళ్లను పరిశీలించారు. మహిళా కళాకారులు, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు, ఉత్సాహవంతులైన వ్యాపారులను ప్రోత్సహిస్తూ వారి ప్రతిభను అభినందించారు. మహిళలకు ఆర్థిక స్వావలంబన, నైపుణ్యాభివృద్ధి, హస్తకళల ప్రోత్సాహం కోసం ఇలాంటి ఈవెంట్స్ గొప్ప వేదికగా నిలుస్తున్నాయని సందేశం ఇచ్చారు.ఈకార్యక్రమం అనంతర నిర్వాహకులైన,పోరెడ్డి కవితా రెడ్డి,పిండి శిరీషా రెడ్డి,చిలుముల రజిత రెడ్డి,కొత్తకాపు శశిరేఖ రెడ్డికి,కార్పొరేటర్లు శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని ప్రజావేదికలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.వీరితో పాటు తెలంగాణ రెడ్డి ఉమెన్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు నూకల పద్మ రెడ్డి,గీత రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# షేక్ పేట్ లో ఘనంగా డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ 69వ వర్ధంతి వేడుకలు.

**ప్రజావినికిడి, షేక్ పేట్ (డిసెంబర్ 6)** నగరంలోని షేక్ పెట్ లో అంబేద్కర్ సర్కిల్లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన జంగయ్య,ప్రయాణ్ ఆశిష్ అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జంగయ్య మాట్లాడుతూ, భారతదేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే మహనీయుల జాబితాలో ముందుండే జాతీయ నాయకుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని,ఆయన ఆలోచనలు, ఆదర్శాలు నేటి తరానికే కాక భవిష్యత్ తరాలకు కూడా స్ఫూర్తిదాయకం అని,అంబేద్కర్ ను ఏ ఒక్క కులానికో, మతానికో ఆపాదించలేమని, ఆయన్ను కులాలకు మతాలకు పరిమితం చేయడం అంటే ఆ మహనీయుడిని తక్కువ చేసి చూడడమే అవుతుందని,దళితుల పట్ల నాడు ఉన్న వివక్షను రూపుమాపేందుకు అంబేద్కర్ తన జీవితకాలం చేసిన పోరాటం మరువలేనిదని, అంటరానితనం గురించి ఆయన చేసిన పోరాటం చిరస్థాయిగా నిలిచిపోయిందని, డాక్టర్ భీమ్ రావ్ అంబేద్కర్ న్యాయవాదిగా, ఆర్థికవేత్తగా, రాజకీయవేత్తగా, సామాజిక సంస్కర్తగా భారతీయులకు పరిచయం చేయక్కర్లేని నేత అని,అంతకంటే మిన్నగా రాజ్యాంగ నిర్మాతగా అంబేద్కర్ పేరు చరిత్ర ఉన్నంతకాలం పదిలంగా ఉంటుందని,అంటరానితనంపై ఆయన పూరించిన సమర శంఖం నేటికి ఆగ్రహజ్వాలలు పెల్లుబుకుతూనే ఉందని,దళితులు, మహిళలు,కార్మికుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసిన యోధుడు అంబేద్కర్ అని,కుల,మత రహిత ఆధునిక భారతదేశం కోసం అంబేద్కర్ తన జీవితకాలం పోరాటం చేశారని



,దళితుల పట్ల నాడు ఉన్న వివక్షను రూపుమాపేందుకు అంబేద్కర్ చేసిన పోరాటం మరువలేనిదని ,అంటరానితనం గురించి ఆయన చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని,చిన్ననాటి నుంచే తాను ఎదుర్కొన్న అంటరానితనాన్ని ఎవరు ఎదుర్కోకూడదని అణగారిన వర్గాలకు అండగా నిలబడ్డారని ,ఆయన చేపట్టిన కార్యక్రమాలు ఇప్పటికీ చారిత్రాత్మకమైనవని, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వివక్షలాన్నింటిని ఎదుర్కొంటూ మెట్రిక్యులేషన్ అత్యధిక మార్కులతో పాస్ అయ్యాడని,బి.ఏ ఉత్తీర్ణులైన అంబేద్కర్ ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లారు. కొలంబియా యూనివర్సిటీ,లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ తో పాటు ఎన్నో ప్రఖ్యాతి గాంచిన విద్యా సంస్థల్లో విద్యను అభ్యసించారని,ఎంఏ, పీహెచ్డీ,న్యాయ శాస్త్రంలో పి హెచ్ డి పూర్తి చేశారని, విదేశాలలో ఎకనామిక్స్ లో డాక్టరేట్ పొందిన మొట్టమొదటి భారతీయుడిగా గుర్తింపు పొందారని , ఇండియాకు తిరిగి వచ్చి దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి పెట్టారని,ఇలాంటి సమస్యలను ఎదిరించాలంటే చదువు ఒక్కటే మార్గమని భావించారని, స్వాతంత్ర భారతావానికి తొలి న్యాయశాఖ మంత్రిగా పనిచేశారని,దేశానికి రాజ్యాంగ రచన బాధ్యతలను అప్పటి ప్రభుత్వం ఆయనకు అప్పగించిందని, భారత రాజ్యాంగ పరిషత్ నియమించిన రాజ్యాంగ సంఘానికి ఆయనను అధ్యక్షునిగా ఎన్నుకున్నారని,అనేక దేశాల రాజ్యాంగాన్ని అధ్యయనం చేసిన అంబేద్కర్ దృఢమైన రాజ్యాంగాన్ని దేశానికి అందించారని, రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 సంవత్సరాలు గడిచిన ఇప్పటికి అంబేద్కర్ ఆశించిన ఫలాలను అణగారిన కులాలు అందుకోలేకపోతున్నాయని,వారిపై జరుగుతున్న అమానుష దాడులను రూపుమాపలేక పోవడం ప్రభుత్వాల చిత్తశుద్ధిని తెలియజేస్తున్నదని, దళితులపై,నిమ్న వర్గాలపై దాడులు జరిగినప్పుడు ఒకరిపై ఒకరు నిందారోపణలు చేసుకోవడమే తప్ప రాజకీయ నాయకులకు వారి పట్ల నిజాయితీని కలిగి ఉండకపోవడం బాధాకరం అని,అంబేద్కర్ ఆశించిన జాతీయవాదం, సమగ్రత రాజకీయ పార్టీల్లో వెల్లివిరియాల్సిన అవసరం ఉందని,ఓటు అనే వజ్రాయుధాన్ని రాజ్యాంగం ద్వారా అంబేద్కర్ ప్రజలకు అందించాడని, జనాభాలో అత్యధిక శాతం ఉన్న బీసీ, ఎస్సీ,ఎస్టీ లు అధికారంలోకి రావాలని ఆకాంక్షించాడని,విశాల భారతావని కోసం పరితపించిన ఆ మహానుభావుడి ఆశయాలను ఆచరించడం, అదేవిధంగా అణగారిన వర్గాలకు రాజ్యాధికారం సాధించడమే ఆయనకు మనమిచ్చే ఘనమైన నివాళి అని పేర్కొన్నారు.

# లెక్చరర్స్ కాలనీ సంక్షేమ సంఘం మొదటి అంతస్తు భవనం ప్రారంభోత్సవం..


## హర్షం వ్యక్తం చేసిన కాలనీ యూత్ సభ్యులు



**ప్రజావినికిడి, (ఎల్బీనగర్):**హయత్ నగర్ లోని లెక్చరర్స్ కాలనీ సంక్షేమ సంఘ మొదటి అంతస్తు భవనం శనివారం నాడు ఘనంగా ప్రారంభోత్సవం జరిగింది. ఈ సందర్భంగా లెక్చరర్స్ కాలనీ యూత్ తరఫున దేవి రెడ్డి అఖిల్ రెడ్డి అండ్ సభ్యులు కాలనీ అధ్యక్షులు కొప్పుల శ్రీనివాస్ రెడ్డి అండ్ కమిటీ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇక్కడ కమ్యూనిటీ హాల్ మొదటి భవనం కట్టడం చాలా హర్షించదగ్గ విషయం అని అన్నారు. కాలనీవాసులంతా ఐక్యమత్యంగా ప్రతి కార్యక్రమాన్ని చేసుకోవచ్చని తెలిపారు.

# మదనపల్లి సర్పంచ్ గా గెలిపిస్తే సమస్యలను పరిష్కారం చేస్తా..

## అభ్యర్థి పండల రుత్వీక సాయిబాబా గౌడ్..






**ప్రజావినికిడి,(శంషాబాద్):డిసెంబర్ 6:**మదనపల్లి గ్రామపంచాయతీ కొన్న రెవెన్యూ ఒకచోట ఉంటే ఓట్లను మరోచోటికి మార్చాలని గ్రామపంచాయతీ అభ్యర్థి పండల అభ్యర్థి పండల రుత్వీక సాయి బాబా గౌడ్ ఆరోపించారు, శంషాబాద్ మండలంలోని మదనపల్లి గ్రామం పంచాయతీకి కత్తెర గుర్తుపై పోటీ చేస్తున్న అభ్యర్థి రుత్వీక సాయిబాబాగౌడ్ శనివారం సాయంత్రం మదనపల్లి గచ్చి భాయ్ తండా లో జోరుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా బస్తీల్లో తిరుగుతూ కత్తెర గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని ఓటర్ల అందర్నీ కోరారు ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ, గాచ్చిబాయ్ తండాకు రెవెన్యూ ఒకచోట ఉంటే ఓటర్లని గచ్చిబాయ్ తండాలోకి మార్చారని ప్రభుత్వం చేసిన ఇది పెద్ద తప్పిదమని తనను ఓటేసి గెలిపిస్తే వెంటనే ఈ మార్పు చేయిస్తానని వారు అన్నారు ఇక్కడి రాజకీయ నాయకులు ఎలాంటి అభివృద్ధి చేయలేదని కేవలం సంపాదించుకోవడానికి కృషి చేశారని అన్నారు తనను గెలిపిస్తే అవసరమైన మార్పు తెస్తానని గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని వారు హామీ ఇచ్చారు ఎన్నో రంగాల్లో గ్రామ అభివృద్ధి చెందేటట్లు యువతలో చైతన్యం అలాగే కార్మికులు
6 అవసరమైన వారికి ఆర్థిక సాయం అందేలాగా లోన్లు సౌకర్యాలను అందుబాటులోకి తెస్తానన్నారు కత్తెర గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని సర్పంచ్ అభ్యర్థి పండాల రిత్విక సాయిబాబా కోరారు ఈ కార్యక్రమంలో తన గ్రామస్తులుపూర్తిస్థాయిలో ఆదరిస్తున్నారని తప్పకుండా తనను గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

# చౌడమ్మగుట్ట శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో

# ఘనంగా పల్లకీ సేవ అన్నదాన కార్యక్రమం





**ప్రజావినికిడి,(షాద్ నగర్):**
అయ్యప్ప స్వాములకు అన్నదానం చేయడం మహాభాగ్యమని షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి అన్నారు. షాద్ నగర్ మున్సిపాలిటి పరిధిలోని సోలిపూర్ చౌడమ్మగుట్ట శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భజన భక్త బృందం సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారి పల్లకి సేవ వైభవంగా నిర్వహించారు. శ్రీ ఆంజనేయస్వామి విగ్రహాన్ని పల్లకిలో మోస్తూ శ్రీరామ జయరామ,జయ జయ రామ నినాదాలతో ఆట పాటలతో,భజనలతో భక్తులు పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. భక్తి పాటలు భజనలతో ఆలయంలో శ్రీ రామ నామస్మరణతో మార్మోగింది. ఆలయ ప్రధాన అర్చకులు రఘుపతిరావు,రాఘవేంద్రాచార్య, అర్చకులు కృష్ణ, ప్రమోద్,సునీల్ పంతులు ఆధ్వర్యంలో భక్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. దేవాలయ ఆవరణలో అయ్యప్ప స్వాములకు,భక్తులకు మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారిని దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా గోశాలలోని ఆవులకు ఒక ట్రాక్టర్ గడ్డి లోడు దానం చేసిన పౌల్ట్రీ పారిశ్రామికవేత్త గుదే వసంతరావుకు దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు. ఈ కార్యక్రమంలో అగ్గనూరు విశ్వం, వన్నాడ ప్రకాష్ గౌడ్, మాజీ సర్పంచ్ పులిమామిడి శ్రీశైలం గౌడ్,విజయ్ కుమార్ రెడ్డి గూనెల్లి రమేషప్ప, ఎంసాని నర్సింలు,జి.వసంతరావు, అన్నారం రఘు గౌడ్,గడ్డమీద రమేష్, శంకర్ గౌడ్,యాదగిరి, రఘునందన్ రెడ్డి,క్యాసెట్ శ్రీనివాస్,సుప్ప నర్సింలు, నారాయణ,వీర్లపల్లి కృష్ణయ్య, శంకరయ్య,వీఆర్వో బచ్చన్న,సుప్ప కృష్ణయ్య,పి.ప్రవీణ్ గౌడ్,పద్మా వెంకటేష్,జగన్,గోరియా నాయక్,కొత్త సత్తయ్య గౌడ్, శ్రీనివాస్,రమేష్,రవి,హనుమంత్ రెడ్డి,రవీందర్,నరసింహులు,మాజీ వార్డు సభ్యులు సింగపాగ లక్ష్మయ్య,భజన భక్త బృందం మహిళలు తదితరులు పాల్గొన్నారు.




# స్పందించే హృదయాలు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ!

**ప్రజావినికిడి,(కంభం):**
కంభం పట్టణంలోని, రైల్వే స్టేషన్,బస్టాండ్, చర్చి సెంటర్, కందులాపురం సెంటర్, తదితర ప్రాంతాలలో, ఆయా షాపుల ముందు నిదురించే అనాధలకు,స్పందించే హృదయాలు చారిటబుల్ ట్రస్ట్ వారు,శ్రీ దుర్గా భవాని జువెలర్స్ అధినేత, సులాకే చిన్నోజి రావు, తదితరుల ఆర్థిక సహకారంతో,కంభం లయన్స్ క్లబ్ సభ్యులు శనివారం రాత్రి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్,డాక్టర్ పులి శ్రీనివాస ప్రసాద్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు,తన్నీరు బాల రంగారావు, కార్యదర్శి,సిరిగిరి వెంకటరావు, కోశాధికారి,పేర్లి గుండయ్య,సర్వీస్ ప్రోగ్రాం చైర్మన్, సయ్యద్ జాకీర్ హుస్సేన్,ఎల్ సి ఐ ఎఫ్ కోఆర్డినేటర్,మొగల్ మహబూబ్ బేగ్,ఎస్ హరికృష్ణ పాల్గొన్నారు.





# గిరిజనులకు జీవనోపాధి మార్గాలు పెంచాలి

**-పకడ్బందీ ప్రణాళికను అమలు చేయాలి**

**- గిరిజన ఉత్పత్తుల పెంపు, మార్కెటింగ్ అవసరం**

**-ఎకో టూరిజం మీద అవగాహన కల్పిస్తే ఆదాయ వృద్ధి**

**-ఉప ముఖ్యమంత్రి, మంత్రిపవన్ కళ్యాణ్**

**అమరావతి, డిసెంబర్ 6ప్రజావినికిడి**
అడవిని నమ్ముకొని బతికే గిరిజనుల జీవన ప్రమాణాలు పెరిగేలా యంత్రాంగం పనిచేయాలి. వారి ఆదాయ మార్గాలు పెంచాలి. దానికి తగినట్లుగా ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమాలను రూపొందించాలని ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిపవన్ కళ్యాణ్ అధికారులకు స్పష్టం చేశారు. అటవీ ఉత్పత్తుల తయారీ, మార్కెటింగ్, ఎకో టూరిజం, పర్యాటకం పెంపు వంటి కీలకమైన అంశాలను ప్రాతిపదికగా తీసుకొని గిరిజన యువతలో నిరుద్యోగ సమస్య లేకుండా చేయాలన్నారు. శనివారం అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ శ్రీ దినేష్ కుమార్, ఎస్పీ శ్రీ అమిత్ బర్దర్ లతో ఉప ముఖ్యమంత్రివర్యులు మంగళగిరి క్యాంపు కార్యాలయం నుంచి టెలీ కాన్ఫెరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్ లో గతంలో అల్లూరి సీతారామ రాజు జిల్లా కలెక్టర్ గా పనిచేసి, ప్రస్తుతం చిత్తూరు కలెక్టర్ గా సేవలందిస్తున్న శ్రీ సుమిత్ కుమార్, గతంలో అల్లూరి సీతారామ రాజు జిల్లా ఎస్పీగా పనిచేసి ప్రస్తుతం శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీగా పని చేస్తున్న శ్రీ సతీష్ కుమార్ లు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అల్లూరి జిల్లా అటవీ ప్రాంతంలో గంజాయి నిర్మూలన అంశంపైనా చర్చించారు. శ్రీ పవన్ కళ్యాణ్ గారు మాట్లాడుతూ "ప్రపంచం వేగంగా ముందుకు వెళుతోంది. దేశంలోనూ గణనీయమైన మార్పులు వస్తున్నాయి. దీన్ని అందిపుచ్చుకోవాలి. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లోని వారి



శక్తిని, శ్రమను ఉపయోగించుకొని వారి జీవన ప్రమాణాలను పెంచాలి. అటవీ ఉత్పత్తులు, ఆర్గానిక్ ప్రొడక్ట్స్ కి ఎంతో డిమాండ్ ఉంది. కాఫీ తోటలతోపాటు అడవిలో విరివిగా దొరికే ఉత్పత్తులను సాగు చేసేలా ప్రోత్సహించాలి. మార్కెట్ డిమాండు అనుసారం అటవీ ఉత్పత్తులను విరివిగా పెంచేలా చూడాలి. నిత్యం గిరిజనులతో మమేకం కావడం, వారి ఆలోచనలను వినడం, వారికి సహాయం చేయడం మర్చిపోవద్దు. వారిలో నూతన ఉత్తేజం నింపేలా కొత్త కార్యక్రమాలతో ఎప్పటికప్పుడు ముందుకు సాగాలి. గిరిజనుల ఆదాయం పెరగాలి. వారికి అన్ని సదుపాయాలు, సౌకర్యాలు అందాలి. విభిన్న మార్గాల్లో ఎలా ఆదాయం పొందాలో యువతలో స్ఫూర్తి నింపి, వారిని ఎంటర్ ప్రెన్యూర్స్ గా తీర్చిదిద్దాలి. వారిలో ఆత్మవిశ్వాసం పెంచేలా చేయాలి. ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను వారికి అందుబాటులోకి తీసుకురావాలిఏజెన్సీ ప్రాంతంలో ఉద్యాన పంటలకు అనువుగా ఉంటుంది. దీన్ని ఉపాధి హామీతో అనుసంధానం చేయడం ద్వారా మంచి ఫలితాలు వస్తున్నాయి. దీనిపై మరింత గా దృష్టి సారించి, వివిధ రకాల పనులకు ఉపాధి హామీ అనుసంధానం అయ్యేలా అధికారులు పరిశీలన చేయాలి. ఏజెన్సీలో ఉద్యాన పంటల విస్తీర్ణం పెంపుదలతో పాటు దానికి తగిన అనుసంధాన పనులు ఉపాధి పనుల్లో భాగంగా చేసుకునేందుకు వీలు కలుగుతుంది. ఇది గిరిజనులకు ఉపాధి కల్పనతో పాటు గిరిజన ప్రాంతాల్లో అటవీ ఉత్పత్తుల పెంపుదలకు ఎంతో తోడ్పాటునిస్తుంది. కాఫీ పంటలతో పాటు ఏజెన్సీలో అనువుగా ఉండే పంటలను పండించేలా కృషి చేయాలి.

ప్రకృతిని రక్షిస్తూ పర్యాటకం పెంపుదల చేయాలి
ఏజెన్సీ ప్రాంతాల్లో పర్యాటకం పెంపుదల ప్రధానం. ప్రతి ఒక్కరిరీ నేడు పర్యాటకం మీద ఆసక్తి పెరుగుతోంది. ఎకో టూరిజం అనేది ప్రపంచంలో వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న రంగం. దీన్ని అందింపుచ్చుకోవాలి. సహజమైన ప్రకృతి సంపదకు ఏ మాత్రం నష్టం వాటిల్లకుండా ఎకో టూరిజం పెంపుదలపైన గిరిజనులకు తగిన అవగాహన కల్పించాలి. యువతకు టూరిజం వల్ల వచ్చే లాభాలు, పర్యాటకులకు వసతి కల్పించడం ద్వారా అందే ఆదాయం మీద చైతన్యం కల్పిస్తే మంచి ఫలితాలు వస్తాయి. అతి తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం సంపాదించే మార్గాలను వారికి చెప్పాల్సిన అవసరం ఉంది. సినిమాలు, సీరియళ్లతో పాటు ఓటీటీ కంటెంట్ లను ఏజెన్సీ ప్రాంతాల్లో షూట్ చేసుకునేలా ప్రోత్సహించాలి. దీని వల్ల గిరిజనులకు ఆదాయం పెరగడంతో పాటు యువతకు ఉపాధి లభిస్తుంది.
గిరిజన ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి, వారి జీవన ప్రమాణాల పెంపునకు తీసుకుంటున్న చర్యలపై ఎప్పటికప్పుడు చర్చిద్దాం. నిరంతర అనుశీలన చేసి, నెలవారీ రిపోర్టులతో ముందుకు సాగుదాం. సమన్వయంతో యంత్రాంగం ముందుకు సాగితే కచ్చితంగా గిరిజనుల బతుకు చిత్రాలు మారుతాయి. దీనికి అనుగుణంగా పకడ్బందీ ప్రణాళికను సిద్ధం కావాలి. దీనికి ఎల్లపుడూ ప్రభుత్వ సహకారం ఉంటుంది" అని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో అధికారులు వారి ఆలోచనలను, ప్రణాళికలను ఉప ముఖ్యమంత్రివర్యుల వద్ద చర్చించారు.




# మధురాపురం "రింగ్ మాస్టర్"..!

- ◆ లక్షల్లో జీతం.. విలాసవంతమైన జీవితాన్ని వదిలి ఊరి కోసం..
- ◆ సొంతూరుకి సేవ చేయాలని "శ్రీమంతుడి" ఆరాటం
- ◆ "రింగు మాస్టర్" గా బండి శ్రీను రాజకీయ ప్రస్థానం
- ◆ "డబ్బుతో కొనేది ఆస్తులు,ప్రేమతో గెలిచేది మనుషులు"
- ◆ సర్పంచ్ బరిలో "మధురాపురం మొనగాడు"

ప్రజావినికిడి,(షాద్ నగర్):

**లక్షల్లో జీతం వంటి విలాసవంతమైన జీవితాన్ని వదిలేసి స్థానిక సమరానికి సై అంటున్నాడు ఈ పల్లె మొనగాడు.కన్నతల్లి, పుట్టిన ఊరు సమానం అంటారు.అలాంటి సొంత ఊరికి సేవ చేయడం కోసం ముంబాయిలో లక్షణంగా లక్షల్లో వేతనం వచ్చే ఉన్నతోద్యోగాన్ని తృణ ప్రాయంగా త్యజించి గ్రామానికి సేవ చేసేందుకు వచ్చేశాడు ఇతడు. "డబ్బుతో కొనేది ఆస్తులు, ప్రేమతో గెలిచేది మనుషులు" అనే విషయాన్ని గ్రహించి సంపద, సంబంధాల మధ్య తేడా గుర్తించి సొంతూరుకు ఏదో ఒకటి చేయాలన్న కృత నిశ్చయంతో గ్రామ సర్పంచ్ కావాలనే దృక్పథంతో ఎన్నికల కథనరంగంలో దిగాడు ఈ యువ నాయకుడు..! మధురాపురం "రింగ్ మాస్టర్" గా షాద్ నగర్ నియోజకవర్గం లోనే పంచాయతీ ఎన్నికల్లో రాజకీయ నూతన ఒరవడికి శ్రీకారం చుట్టి గ్రామ పెద్దలను మెజార్టీ స్థాయిలో తన వైపు తిప్పుకొని ముందడుగు వేస్తున్న పినమోని శ్రీనివాస్ అలియాస్ బండి శ్రీను కథ ఇది..!**



## మధురాపురం మొనగాడు..

లక్షల్లో జీతం విలాసవంతమైన జీవితాన్ని వదిలేసి స్థానిక సమరానికి సై అంటూ తను నమ్ముకున్న గ్రామాన్ని ప్రజలకు ఏదో ఒకటి చేయాలని విశ్వాసంతో రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం ఫరూక్ నగర్ మండలం మధురాపురం గ్రామానికి చెందిన పినమోనీ శ్రీనివాస్ అలియాస్ బండి శ్రీను రాజకీయ ప్రస్థానం గొప్పదని చెప్పాలి. మధురాపురం గ్రామం అంటేనే నియోజకవర్గంలో ఒక రాజకీయ చైతన్యవంతమైన ఊరు. నియోజకవర్గంలో ఏ ఎన్నికలు జరిగినా అందరి దృష్టి మధురపురం గ్రామపనే ఉంటుంది.ఇక్కడ పోటీ అంటేనే రసవత్తరం అని చెప్పవచ్చు. ఏదో ఒక ప్రత్యేకత ఈ గ్రామానికి అలా ఇమిడిపోతుంది. మొదటి నుండి ఒక విశిష్టత కలిగిన ఈ గ్రామంలో ఒకసారి సర్పంచ్ గా గెలిచినవారు మళ్లీ సర్పంచుగా గెలవలేరు అన్న సెంటిమెంట్ కూడా ప్రచారంలో ఉంది. గ్రామం ఏర్పాట్లు నాటి నుండి జరిగిన ఎన్నికల్లో మొట్టమొదట లట్టుపల్లి యాదగిరిరెడ్డి (ప్రముఖ జర్నలిస్టు మోహన్ రెడ్డి తండ్రి ) సర్పంచిగా ఎన్నికయ్యారు.ఆ తర్వాత కాలంలో సర్పంచులుగా లక్నాపురం హనుమంత్ రెడ్డి, గుండ్రాతి నర్సింలు గౌడ్, దామోదర్ రెడ్డి, బొమ్ము బాలమణి, అనంత పద్మనాభ రెడ్డి (ఏపీ రెడ్డి),గుండ్రాతి బాలరాజు గౌడ్, బొమ్ము జ్యోతి రంగయ్య,లక్నాపురం శివారెడ్డిలు సర్పంచులుగా గ్రామానికి సేవలు అందించారు. ఇందులో గతంలో కొంతమంది గెలిచిన తర్వాత కూడా పోటీ చేశారు కానీ రెండవసారి గెలవలేకపోయారు. ఈ గ్రామంలో ఒకసారి గెలిచిన తర్వాత మరోసారి గెలువలేదు అన్న సెంటిమెంటు ప్రచారంలో ఉంది. అయితే గ్రామానికి చెందిన పినమోని శ్రీనివాస్ అలియాస్ బండి శ్రీను వృత్తిరీత్యా సాఫ్ట్ వేర్ ఉద్యోగి కావడం విశేషం. ముంబై బెంగళూరు ప్రాంతాల్లో సాఫ్ట్ వేర్ ఉద్యోగంలో స్థిరపడ్డ శ్రీనివాస్ గతంలో కోవిడ్ 19 సందర్భంగా గ్రామానికి వచ్చిన అతను తన గ్రామం కోసం ఏదైనా చేయాలని బలంగా నిశ్చయించుకున్నాడు. నా జన్మభూమి అంటూ రాజకీయంగా ఏదైనా పట్టు సాధించి ప్రజలకు మంచి పాలన అందించాలని నిశ్చయించుకున్నాడు. అనుకున్నదే తడవుగా స్థానిక నాయకులు గ్రామ పెద్దలతో కలిసి కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆశీస్సులతో పార్టీకి సేవలు అందించారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ను ఆదర్శంగా తీసుకుని ఒక బడుగు బలహీన వర్గాల బిడ్డ ఇలా ఎదిగాడో అలా ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాడు శ్రీనివాస్.ప్రస్తుతం పార్టీ పెద్దల నిర్ణయం శిరోధార్యంగా అందరి మనసులను గెలుచుకొని ముందుగా గ్రామంలో పోటీకి దిగాడు.గ్రామంలో ముఖ్య నాయకులను ఏకతాటిపైకి తీసుకువచ్చి అందరి మద్దతు తనకు లభించేలా చేసుకున్నాడు. మొదటి ప్రయత్నంలోనే అందరి మద్దతు తీసుకొని మధురాపురం మొనగాడుగా రాజకీయంగా నిలిచాడు.








## మధురాపురం "రింగ్ మాస్టర్"

మొదటి ప్రయత్నంలోనే రాజకీయంగా కాంగ్రెస్ పార్టీలో మెజార్టీ నాయకుల మద్దతు కూడగట్టుకున్న బండి శ్రీను సర్పంచ్ బరిలో హోరాహోరీ ప్రచారం నిర్వహిస్తున్నారు. శ్రీనివాస్ కు ఈ పోటీలో రింగు గుర్తు లభించింది. రాజకీయాల్లో కూడా చక్రం తిప్పి అందరిని తన వైపు తిప్పుకున్న "రింగు మాస్టర్" గా ఇతనే ఇప్పుడు మధురాపురంలో అందరూ చెప్పుకుంటున్నారు. మధురాపురం కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు లక్నాపురం మధుసుధన్ రెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, ఆ గ్రామం మాజీ సర్పంచ్ గుండ్రాతి బాలరాజు గౌడ్,మాజీ జెడ్పీటీసీ పంది వెంకటరామిరెడ్డి, మాజీ ఎంపిటిసి భార్గవ్ కుమార్ రెడ్డి,మాజీ సింగల్ విండో డైరెక్టర్ నంద్యాల పుల్లారెడ్డి, గ్రామ సీనియర్ నాయకుడు అమర్నాథ్ రెడ్డి,లీల మనోహర్ రెడ్డి,ముదిరాజ్ సామాజిక వర్గం నుండి పినమోని జంగయ్య, మొగలిగిద్ద జంగయ్య, కేతేపల్లి నరసింహ, జానంపేట రమేష్, ఎర్రోళ్ల నారాయణ, పినమోని బుగ్గయ్య, గౌడ సామాజిక వర్గం నుండి మాజీ సర్పంచ్ గుండ్రాతి నర్సింలు గౌడ్,వినయ్ గౌడ్, నక్కల మధుగౌడ్, శ్రీధర్ గౌడ్,మురళి ధర్ గౌడ్,మల్గాని రాజు గౌడ్,సందీప్ గౌడ్, గుండ్రాటి రాజు గౌడ్, డాక్టర్ గాండ్ల శ్రీకాంత్, రెడ్డి సామాజిక వర్గానికి చెందిన ఎంఎన్ఆర్ సేవా సంస్థల అధినేత సోమిరెడ్డి నరేందర్ రెడ్డి,లక్నాపురం బుచ్చిరెడ్డి,రామేశ్వర్ రెడ్డి, రామచంద్రారెడ్డి, రామ్ రెడ్డి,వెంకట్ రెడ్డి, ముస్లిం సామాజిక వర్గానికి చెందిన అక్బర్,సమద్, జావీద్,గౌస్ పాషా, బాబర్,వారిస్,ఎస్సీ సామాజిక వర్గం నుండి కొమ్ము రామయ్య, గజ్జెల రవి,దర్శన్, సుజీవన్,గిరిజన సామాజిక వర్గం నుండి హరి నాయక్,వెంకటేశ్ నాయక్,బుచ్యా నాయక్,పాండు నాయక్ రాములు నాయక్, రవి నాయక్ వంటి హేమహేమీలు బండి శీను వెంట ఉన్నారు. అన్ని వర్గాలను ఏకం చేసిన రింగ్ మాస్టర్ గా బండి శ్రీను గ్రామంలో రాజకీయ లజడి సృష్టిస్తున్నాడు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆశీర్వాదంతో రాజకీయాల్లోకి వచ్చిన బండి శ్రీను ఇప్పుడు మెజార్టీ కాంగ్రెస్ అధికార పార్టీ నాయకుల మన్ననలు కూడా పొందాడు.ఇక ప్రజల మన్ననలు పొంది సర్పంచిగా గెలుపొందే ప్రణాళికలు రచిస్తున్నాడు.ఏది ఏమైనా కన్నతల్లి లాంటి ఊరుని నమ్ముకుని ఉన్నత ఉద్యోగాన్ని విడిచి ప్రజలకు సేవ చేయాలని తపన బండి శ్రీనును సర్పంచ్ గా నిలబెడుతుందని ఆశిద్దాం.. డబ్బు హోదాను పక్కనపెట్టి గ్రామస్తుల కోసమే ముందుకు వచ్చిన బిడ్డను మధురాపురం గ్రామ విజ్ఞులైన ప్రజలు ఎలా ఆదరిస్తారో వేచి చూద్దాం..!



## సెట్స్‌లో అడుగుపెట్టిన

# సమంత..!!



ఇటీవలే రాజ్ నిడిమోరుతో వివాహ బంధంలో అడుగుపెట్టిన సమంత రూత్ ప్రభు.. పెళ్లైన నాలుగు రోజులకే సెట్స్ అడుగుపెట్టింది. తన బ్యానర్ లో స్వీయ నిర్మాణంలో తెరకెక్కుతున్న 'మా ఇంటి బంగారం' సినిమాపై ఫోకస్ పెట్టింది. క్రైమ్ థ్రిల్లర్ గా వస్తున్న ఈ సినిమాపై అప్పుడే అంచనాలు పెరిగిపోయాయి. ఈ చిత్రానికి నందిని రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. సమంత భర్త రాజ్ నిడిమోరు ఈ సినిమాకి కో-ప్రొడ్యూసర్ గా వ్యవహరిస్తున్నాడు. సమంత రూత్ ప్రభు ఇటీవలే దర్శకుడు రాజ్ నిడిమోరుతో కలిసి వివాహ బంధంలో అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. డిసెంబర్ 1వ తేదీల తెల్లారుజామున వీరి వివాహం జరిగింది. కొత్త జీవితం ప్రారంభించిన సామ్.. కొన్ని రోజులు సినిమా షూటింగులకు బ్రేక్ తీసుకుంటుందని అభిమానులు భావించారు. అయితే సమంత పెళ్లైన నాలుగు రోజులకే సెట్స్ లో అడుగుపెట్టింది. ఈ విషయాన్ని డైరెక్టర్ నందిని రెడ్డి సోషల్ మీడియాలో వెల్లడించింది. సమంత స్వీయ నిర్మాణంలో ప్రస్తుతం 'మా ఇంటి బంగారం' అనే సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. నందిని రెడ్డి దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఇందులో సామ్ తో పాటుగా గుల్షన్ దేవయ్య, దిగంత్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. నటి గౌతమి, మంజుషా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. దసరా పండక్కి ఈ సినిమాని పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభించారు. తాజాగా సామ్ తిరిగి షూటింగ్‌లో జాయిన్ అయినట్లు నందిని రెడ్డి ఇన్‌స్టాగ్రామ్ లో పోస్ట్ పెట్టింది. ఒక ఫొటోని షేర్ చేసింది. ఇంతకుముందు మహానటి కీర్తి సురేష్ కూడా ఇలానే కాళ్ల పారాణి ఆరకముందే సినిమా పనుల్లో బిజీ అయింది. మోడ్రన్ డ్రెస్సులు, మెడలో పసుపు తాడుతో 'బేబీ జాన్' మూవీ ప్రమోషన్స్‌లో పాల్గొంది. ఇప్పుడు సమంత సైతం పెళ్లి చేసుకున్న కొన్ని రోజులకే షూటింగ్ లో అడుగుపెట్టింది. తన బ్యానర్ లో రూపొందుతున్న 'మా ఇంటి బంగారం' సినిమాని వీలైనంత త్వరగా పూర్తి చేయాలనే టార్గెట్ పెట్టుకున్నట్లు అర్థమవుతోంది. ప్రస్తుతం సామ్ – గుల్షన్ దేవయ్య పాల్గొనే కొన్ని కీలక సన్నివేశాలు షూట్ చేస్తున్నట్లు సమాచారం. ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ అనే నిర్మాణ సంస్థ ప్రారంభించి సమంత.. తొలి ప్రయత్నంగా 'శుభం' అనే చిత్రాన్ని నిర్మించింది. ఈ ప్రాజెక్ట్ లో రాజ్ నిడిమోరు కూడా భాగం పంచుకున్నాడు. ఇప్పుడు అదే బ్యానర్ లో ప్రొడక్షన్ నెం.2గా 'మా ఇంటి బంగారం' చిత్రం తెరకెక్కుతోంది. దీనికి రాజ్ కో-ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నాడు. 'ఓ బేబి' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత సమంత, నందినీ రెడ్డి కలిసి చేస్తున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి ఏర్పడింది. 1980ల నేపథ్యంలో సాగే క్రైమ్ థ్రిల్లర్ కథతో గ్రిప్పింగ్ యాక్షన్ డ్రామాగా 'మా ఇంటి బంగారం' రూపొందుతోందని ప్రచారం జరుగుతోంది. ఈ చిత్రానికి సీతా మీనన్, వసంత్ మరిన్‌గంటి కథ, స్క్రీన్‌ప్లే అందిస్తున్నారు. ఓం ప్రకాష్ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తుండగా.. సంతోష్ నారాయణన్ సంగీతం సమకూరుస్తున్నారు. ధర్మేంద్ర కాకరాల ఎడిటర్‌గా వర్క్ చేస్తున్నారు. ఇప్పటికే రిలీజైన సమంత ఫస్ట్ లుక్ పోస్టర్ ఆకట్టుకుంది.

/..............




## ఆంధ్ర కింగ్ తాలుకా


# కలెక్షన్స్ జోరు

బాక్స్ ఆఫీస్ దగ్గర లాస్ట్ వీక్ లో మంచి అంచనాల నడుమ రిలీజ్ అయిన ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని నటించిన ఆంధ్ర కింగ్ తాలుకా సినిమా మంచి పాజిటివ్ టాక్ ను సొంతం చేసుకోగా కలెక్షన్స్ పరంగా సినిమా అన్ని చోట్లా జోరు చూపెడుతుంది అనుకున్నా కూడా ఓవరాల్ గా ఆ రేంజ్ లో బాక్స్ ఆఫీస్ దగ్గర ఇంపాక్ట్ ని ఏమి చూపించలేక పోతున్న సినిమా మొదటి వీక్ ని ఎలాగోలా కంప్లీట్ చేసుకోగా రెండో వీక్ లో అడుగు పెట్టిన సినిమా మరింతగా డ్రాప్స్ ను అయితే కొనసాగిస్తూ ఉందని చెప్పాలి ఇప్పుడు.ఓవరాల్ గా 8వ రోజున 6 వేలకు పైగా టికెట్ సేల్స్ ను మాత్రమే సొంతం చేసుకున్న సినిమా తెలుగు రాష్ట్రలలో 25 లక్షల రేంజ్ లో షేర్ ని సొంతం చేసుకోగా వరల్డ్ వైడ్ గా 30 లక్షలకు పైగా షేర్ ని 60 లక్షలకు పైగా గ్రాస్ మార్క్ ని సొంతం చేసుకోగా%ౌ% మొత్తం మీద సినిమా 28 కోట్ల రేంజ్ లో వాల్యూ బ్రేక్ ఈవెన్ టార్గెట్ తో బరిలోకి దిగగా ఇప్పటి వరకు సాధించిన కలెక్షన్స్ కాకుండా ఇంకా 13.54 కోట్ల రేంజ్ లో షేర్ ని అందుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇక ఈ వీకెండ్ లో సినిమా ఎలాంటి కలెక్షన్స్ ని అందుకుంటుందో చూడాలి.

## హైదరాబాద్‌లో దేశంలోనే

# అతిపెద్ద డాల్బీ స్క్రీన్...

### అల్లు సినిమాస్ కొత్త ప్రయోగం



హైదరాబాద్ సినీ ప్రియులకు అల్లు సినిమాస్ ఓ శుభవార్త అందించింది. దేశంలోనే అతిపెద్ద డాల్బీ సినిమా స్క్రీన్‌ను నగరంలో ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. ప్రేక్షకులకు సరికొత్త వీక్షణ అనుభూతిని అందించే లక్ష్యంతో ఈ భారీ థియేటర్‌ను సిద్ధం చేస్తున్నారు.

ఈ డాల్బీ సినిమా స్క్రీన్ ఏకంగా 75 అడుగుల వెడల్పుతో ఉండనుంది. అత్యుత్తమ విజువల్స్ కోసం ఇందులో డాల్బీ విజన్, డాల్బీ 3డీ ప్రొజెక్షన్ టెక్నాలజీని ఉపయోగించనున్నారు. దీనికి తోడు ప్రేక్షకులను కథలో లీనమయ్యేలా చేసే డాల్బీ అట్మాస్ సౌండ్ సిస్టమ్‌ను కూడా జతచేస్తున్నారు. వీక్షకులకు ఎలాంటి ఆటంకం లేకుండా సినిమాను ఆస్వాదించేందుకు 'పిచ్-బ్లాక్ స్టేడియం సీటింగ్'ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది.ప్రపంచవ్యాప్తంగా సినీ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'అవతార్: ఫైర్ అండ్ యాష్' సినిమా ప్రదర్శనతో ఈ సరికొత్త డాల్బీ స్క్రీన్‌ను ప్రారంభించాలని నిర్వాహకులు యోచిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ కొత్త థియేటర్ ఎప్పుడు ప్రారంభమవుతుందా అని నగరవాసులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.హాలీవుడ్ దర్శక దిగ్గజం జేమ్స్ కామెరాన్ అద్భుత సృష్టి 'అవతార్: ఫైర్ అండ్ యాష్' డిసెంబరు 19న వరల్డ్ వైడ్ గ్రాండ్ గా రిలీజ్ కానుంది. ఈ చిత్రం కోసం భారత్ లోనూ ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



# సుశాంత్ తో పెళ్లి

## వార్తలను ఖండించిన మీనాక్షి టీమ్

టాలీవుడ్ నటి మీనాక్షి చౌదరి, హీరో సుశాంత్ పెళ్లి చేసుకోబోతున్నారంటూ సోషల్ మీడియాలో వస్తున్న వార్తలపై ఆమె టీమ్ స్పందించింది. ఈ ప్రచారంలో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేసింది. వీరిద్దరి పెళ్లి వచ్చే ఏడాది జరగనుందంటూ గత రెండు రోజులుగా కొన్ని మీమ్ పేజీలు, సోషల్ మీడియా ఖాతాలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నాయి.కొన్ని రోజుల క్రితం మీనాక్షి, సుశాంత్ ఓ ఎయిర్‌పోర్టులో కలిసి కనిపించడంతో ఈ వదంతులకు మళ్లీ రెక్కలొచ్చాయి. ఈ నేపథ్యంలో మీనాక్షి టీమ్ అధికారికంగా స్పందిస్తూ ఓ ప్రకటన విడుదల చేసింది. "సుశాంత్, మీనాక్షి కేవలం మంచి స్నేహితులు మాత్రమే. వారిద్దరి మధ్య స్నేహం తప్ప మరే బంధం లేదు" అని తేల్చి చెప్పింది. సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని నమ్మవద్దని, మీనాక్షికి సంబంధించిన ఏ విషయమైనా తామే అధికారికంగా ప్రకటిస్తామని తెలిపింది. ఈ పుకార్లకు ఇకనైనా ఫుల్‌స్టాప్ పెట్టాలని కోరింది.



ఇంతకుముందు కూడా ఇదే తరహా ప్రచారం జరగగా, స్వయంగా మీనాక్షి చౌదరి స్పందించి అవన్నీ అబద్ధాలని కొట్టిపారేశారు. అయినప్పటికీ వదంతులు ఆగకపోవడంతో ఆమె టీమ్ మరోసారి వివరణ ఇచ్చింది. 'ఇచ్చట వాహనములు నిలపరాదు' సినిమాలో మీనాక్షి, సుశాంత్ కలిసి నటించారు. ఆ సినిమా సమయం నుంచి వారి మధ్య మంచి స్నేహం కొనసాగుతోంది.

# ధనుష్ 100 కోట్ల మార్క్

బాక్స్ ఆఫీస్ దగ్గర హిందీలో చాలా టైం తర్వాత మంచి బజ్ తో వచ్చిన కోలివుడ్ స్టార్ హీరో ధనుష్ నటించిన హిందీ సినిమా తేరే ఇష్క్ మే సినిమా డీసెంట్ రివ్యూలను సొంతం చేసుకోగా కలెక్షన్స్ పరంగా సినిమా మంచి జోరుని చూపెడుతూ ఉండగా సినిమా ఓవరాల్ గా%ౌ% వర్కింగ్ డేస్ లో కూడా మంచి ట్రెండ్ ను చూపెడుతూ ఉండగా 5 డేస్ కంప్లీట్ అయ్యే టైంకి సినిమా 69.35 కోట్ల రేంజ్ లో నెట్ కలెక్షన్స్ మార్క్ ని సొంతం చేసుకోగా 6వ రోజున వర్కింగ్ డే లో మరోసారి ఎక్స్ లెంట్ గా హెూల్డ్ ని చూపించిన సినిమా%ౌ%6.89 కోట్ల రేంజ్ లో నెట్ కలెక్షన్స్ మార్క్ ని సొంతం చేసుకుంది%ౌ%ఇక టోటల్ గా 6 డేస్ కంప్లీట్ అయ్యే టైంకి సినిమా 76.24 కోట్ల రేంజ్ లో నెట్ కలెక్షన్స్ ని అందుకోగా డబ్ వర్షన్స్ తో కలిపి సినిమా 79.75 కోట్ల రేంజ్ లో నెట్ కలెక్షన్స్ ని అందుకోగా%ౌ%ఇండియాలో గ్రాస్ 93 కోట్ల రేంజ్ లో సొంతం చేసుకుంది. ఇక సినిమా ఓవర్సీస్ లో 1 మిలియన్ రేంజ్ లో వసూళ్ళని అందుకోగా ఓవరాల్ గా వరల్డ్ వైడ్ గా ఇప్పుడు 6 రోజుల్లో సాధించిన కలెక్షన్స్ తో 100 కోట్ల మార్క్ ని దాటేసి మాస్ రచ్చ చేయడం విశేషం.



## 'మన శంకర వరప్రసాద్‌గారు' నుంచి మరో సాంగ్.. ప్రోమో వచ్చేసింది!

మెగాస్టార్ చిరంజీవి హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'మన శంకర వరప్రసాద్‌గారు' నుంచి మరో క్రేజీ అప్‌డేట్ వచ్చేసింది. ఈ సినిమా నుంచి రెండో పాటను విడుదల చేసేందుకు చిత్ర బృందం తేదీని ఖరారు చేసింది. 'శశిరేఖ' పేరుతో రానున్న ఈ పాటను ఈ నెల 8న విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా పాటకు సంబంధించిన ఓ ఆసక్తికరమైన ప్రోమోను కూడా అభిమానులతో పంచుకుంది.ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన తొలి పాట 'మీసాల పిల్ల' యూట్యూబ్‌లో సంచలనం సృష్టిస్తూ సినిమాపై అంచనాలను భారీగా పెంచేసింది. ఆ పాట విజయంతో ఫ్యాన్స్ ఉత్సాహంగా ఉండగా, ఇప్పుడు రెండో పాట అప్‌డేట్ వారిలో మరింత జోష్ నింపింది.ప్రముఖ దర్శకుడు అనిల్ రావిపూడి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. మెగాస్టార్‌తో పాటు విక్టరీ వెంకటేశ్, నయనతార, కేథరిన్ థ్రెసా వంటి భారీ తారాగణం ఈ సినిమాలో కీలక పాత్రలు పోషిస్తున్నారు. షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి, సుష్మిత కొణిదెల, వి. హరికృష్ణ ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నారు.



Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613